
ఆంధ్రజ్యోతి 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 10, నవంబరు 2025



నీటిని తోడేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో ఏర్పాటు చేసిన 550హెచ్‌పీ మోటార్

మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలతో వెలిగొండ పనులకు ఏర్పడిన ఆటంకాలను ప్రాజెక్టు అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. మంత్రి రామానాయుడు ప్రాజెక్టును సందర్శించి లోటుపాట్ల సవరణపై ఆదేశాలు ఇచ్చిన రోజు నుంచే ఈ పనులను వేగవంతం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టుకు ప్రాజెక్టు తొలి దశ, మార్చికి రెండో దశ పనుల పూర్తి లక్ష్యంతో సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తొలిదశ పూర్తికి ప్రధాన పనులుగా గుర్తించిన వాటిలో రూ.476 కోట్లతో ఫీడర్ కాలువ ఆధునీకీకరణ నిధులు మంజూరై టెండరు ప్రక్రియ కొలిక్కి వస్తోంది. మరో కీలకమైనదిగా వెలిగొండ రెండో టన్నెల్ లైనింగ్ పనిని గుర్తించారు. రిజర్వాయర్‌లో నీటిని నిలిపేలోపు తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం, గొట్టిపడియ కాలువ గేటు ఏర్పాటు, కాకర్ల గ్యాప్ వైపు నుంచి అర్ధవీడు మండలానికి వెళ్లే గ్రామాలకు ప్రత్యామ్నాయ రోడ్లను నిర్మించాల్సి ఉంది. వీటిలో ఒక్కో పనిపై సమీక్ష చేసి గాడిలో పెడుతున్నారు.

వెలిగొండ.. వేగంగా..

- యుద్ధప్రాతిపదికన ఆటంకాల తొలగింపు
- మంత్రి నిమ్మల పర్యటన అనంతరం చకచకా అధికారుల చర్యలు
- మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు టన్నెళ్లలో చేరిన వరద
- భారీ మోటార్లతో తోడివేస్తున్న వైనం
- ఫీడర్ కాలువ గండ్లకు కారణమైన తీగలేరు వాగుపైనా దృష్టి
- 12,13 తేదీల్లో మరోసారి ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రి
- కొలిక్కి వచ్చిన ఫీడర్ కాలువ ఆధునికీకరణ టెండర్ల ప్రక్రియ

ఒంగోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. కేవలం 36 గంటల్లోనే 18.40 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. నల్లమల అటవీ ప్రాంతాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో వెలిగొండ ఫీడర్ కాలువకు ఎగువన ఉన్న తీగలేరు వాగు పొంగి ప్రవహించింది. అప్పటికే బలహీనంగా ఉన్న ఫీడర్ కాలువ మట్టి కట్టలు ధ్వంసమయ్యాయి. ఫీడర్ కాలువ 850 మీటర్ వద్ద ఏకంగా 30 అడుగుల లోతు, వంద అడుగుల పొడవున కొట్టుకుపోయింది. మరో రెండు చోట్ల భారీ గోతులు పడ్డాయి. దీంతో తీగలేరు నీరంతా దిగువకు వచ్చి కడపరాజుపల్లి, కటకానిపల్లి, ఇతర గ్రామాల్లో పొలాలను ముంచెత్తి మేట వేసింది. ఫీడర్ కాలువల్లోనూ మట్టి మేటలతో నీరు ముందుకు సాగడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు టన్నెళ్ల వైపు కూడా నీరు వెళ్లింది. ఒక్కో టన్నెల్‌లో సుమారు 9 కి.మీ లోపలకు భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో రెండో టన్నెల్‌లో లైనింగ్ పనులు నిలిచిపోయాయి.

ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి

ఈనెల 7వతేదీన ప్రాజెక్టు పనుల సందర్శనకు వచ్చిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. టన్నెళ్లలోకి చేరిన వరద నీరు, ఫీడర్ కాలువకు పడిన భారీ గండి, మట్టి పెద్దఎత్తున మేట వేసిన పొలాలు, ఫీడర్ కాలువను చూశారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈనెల 12,13తేదీల్లో తిరిగి తాను ప్రాజెక్టు సందర్శనకు వస్తానని ఆలోపు సదరు పనులు చేయాలని ఆదేశించారు. టన్నెల్‌లోకి వెళ్లిన నీటిని తోడేసి తిరిగి లైనింగ్ పనులు ప్రారంభించాలని, ఫీడర్ కాలువలో మేట వేసిన మట్టిని తక్షణం తొలగించాలని సూచించారు. తీగలేరు వాగులో భారీగా ఆక్రమణలు, దీర్ఘకాలంగా కనీస మరమ్మతులు చేయక పూడిక పెరగడంతో భారీగా వర్షాలు కురిసినప్పుడు ప్రవాహం ఫీడర్ కాలువను దెబ్బతీస్తోంది. తీగలేరులో నీటి ప్రవాహం సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నిమ్మల ఆదేశించారు.



మోటార్లతో టన్నెళ్లలోని నీరు కాలువలోకి తోడివేత

టన్నెళ్లలో చేరిన నీరు మోటార్ల ద్వారా బయటకు..

మంత్రి పర్యటన ముగిసిన వెంటనే సంబంధిత పనులపై ప్రాజెక్టు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. టన్నెళ్ల లోపలికి చేరిన నీటిని మోటార్ల ద్వారా ఫీడర్ కాలువలోకి పంపిస్తున్నారు. సుమారు 12 మోటార్లు (మొత్తం కలిపి 1,540 హెచ్‌పీ సామర్థ్యం) ఏర్పాటు చేశారు. అందులో ఒక మోటారు 550 హెచ్‌పీ శక్తి ఉన్నది కూడా ఉంది. క్రేన్ సాయంతో దానిని తెచ్చి నీటిని తోడేస్తున్నారు. అధికారుల సమాచారం ప్రకారం వెలిగొండ టన్నెళ్లలోకి సుమారు కోటి 30 లక్షల లీటర్ల నీరు చేరింది. ఇప్పటి వరకు దాదాపు 80లక్షల లీటర్ల నీటిని బయటకు పంపారు. మిగిలిన నీటిని కూడా సోమవారం రాత్రికి తోడేసి మంగళవారం టన్నెళ్ల లోపలికి వెళ్లేమార్గం శుభ్రం చేయడం, విద్యుత్ పునరుద్ధరణ తదితర చర్యలు చేపట్టి ఆ వెంటనే రెండో టన్నెల్ లైనింగ్ పనులు మొదలుపెడతారు. ఫీడర్ కాలువలో మేట వేసిన మట్టి తొలగింపు కూడా ఎక్స్‌కవేర్లను ఏర్పాటు చేసి వేగంగా చేస్తున్నారు.

తీగలేరు ఆక్రమణలపై డ్రోన్ల ద్వారా సర్వే

తీగలేరుపై కూడా ప్రాజెక్టు అధికారులు దృష్టి సారించారు. పలుచోట్ల వాగు ఆక్రమణలపై డ్రోన్ల ద్వారా సర్వేచేశారు. ఆదివారం వాగు లోపలి భాగంలో తక్షణం చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఒకవైపు ఆక్రమణల తొలగింపు, మరోవైపు పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతుల పొలాల్లో వేసిన మేట తొలగింపునకు సంబంధించి తక్షణ చర్యలపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా ఫీడర్ కాలువ ఆధునీకీకరణ పనుల కోసం సెప్టెంబరు 22న ప్రభుత్వం రూ.476 కోట్లను మంజూరు చేసింది. గత నెలలో రూ.375 కోట్లతో అధికారులు టెండర్లు పిలిచారు. పది రోజుల క్రితం టెండర్లను తెరవగా కాంట్రాక్టు పొందిన సంస్థ సమర్పించిన అన్ని పత్రాలను పరిశీలించిన అధికారులు రెండు రోజుల్లో అగ్రిమెంట్ కూడా పూర్తి చేయనున్నట్లు సమాచారం. ఆ ప్రకారం చూస్తే ఈనెలలోనే ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టే అవకాశం ఉంది.



- పరిగణనలోకి సాగునీటి వనరులు, రవాణా సౌకర్యం
- అధికారుల నివేదికలో స్పష్టం
- తాజాగా నేతల నుంచి అదే విజ్ఞప్తి
- తర్జనభర్జన అనంతరం సీఎం నిర్ణయానికి వదిలేసిన సబ్ కమిటీ

ప్రకాశంలోనే దర్శి?

(ఆంధ్రజ్యోతి), ఒంగోలు ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉన్న దర్శి అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కూడా అలాగే కొనసాగే అవకాశాలు మెరుగుపడ్డాయి. కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలోకి దర్శిని కలపాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ తాజా పరిణామాలను బట్టి చూస్తే ఆ నియోజకవర్గం ప్రకాశంలోనే కొనసాగే సంకేతాలు కనిపిస్తున్నాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు విషయంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సవరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ఉమ్మడి ప్రకాశంలో పలు చేర్పులు, మార్పులకు మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సు చేస్తోంది. పశ్చిమ ప్రాంతానికి సంబంధించి మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు అవసరమన్న అభిప్రాయానికి వచ్చింది. నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు, బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి నియోజకవర్గాలను ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశంలో కలపాలన్న ప్రజల ఆకాంక్షను కూడా సబ్‌కమిటీ గుర్తించింది. ఆరంభంలో అనుకున్నట్లు దర్శి అసెంబ్లీ నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో చేర్చాలా? లేకా ప్రకాశంలోనే కొనసాగించాలా? అన్న అంశం తెరపైకి వచ్చింది. ప్రజలు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారుల అభిప్రాయాలను కూడా నివేదికల రూపంలో ఇవ్వాలని మంత్రివర్గ సబ్‌కమిటీ కోరింది. ఆ ప్రకారం కలెక్టర్ నుంచి వెళ్లిన ప్రతిపాదనలో దర్శిని ప్రకాశంలోనే కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్కాపురం కేంద్రంగా నాలుగు నియోజకవర్గాలను కలిపి జిల్లాను ఏర్పాటు చేయాలని సూచించారు.

తాజాగా దర్శికి చెందిన రాజకీయ నేతలు, ప్రజా సంఘాలు, ప్రజల నుంచి కూడా నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలన్న వినతులు కూడా ప్రభుత్వానికి అందాయి. ఇదే విషయమై ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి.. ఇటు అధికారులతోపాటు అటు రాష్ట్ర మంత్రులను కలిసి కూడా విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ ఉపసంఘ చైర్మన్ అనగాని సత్యప్రసాద్, ఇతర మంత్రులు.. జిల్లాతో సంబంధం ఉన్న మంత్రులు రవికుమార్, శ్రీబాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ ఎమ్మెల్యేలతో కూడా మాట్లాడినట్లు తెలిసింది. తదనుగుణంగా వారు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు జరగాలని సూచిస్తూనే దర్శి విషయంలో తాజాగా వచ్చిన ప్రతిపాదనలు కూడా పరిశీలించాలని కోరినట్లు సమాచారం.ఈ విషయంలో సీఎం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ముందుకు పోవాలని సబ్ కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు తెలిసింది.

సాగునీటి వనరులు, రవాణా కీలకం

రవాణా సౌకర్యం, సాగునీటి వనరులతో ఉన్న సంబంధాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశంలో ఉంచాలన్న అభిప్రాయానికి ఉపసంఘం సభ్యులు వచ్చినట్లు తెలుస్తోంది. తాళ్లూరు, ముండ్లమూరు మండలాలు పూర్తిగా, దర్శి మండలంలో 90 శాతానికిపైగా గ్రామాలకు రవాణా సౌకర్యం ఒంగోలుకే సులువుగా ఉంది. కురిచేడు మండల కేంద్రం నుంచి నేరుగా అద్దంకికి రహదారి సౌకర్యం ఉంది. దొనకొండ మండలంలోని ఎక్కువ గ్రామాలకు కురిచేడు మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే మార్కాపురానికి వెళ్లేందుకు సులువుగా ఉంటుంది. మరోవైపు సాగర్ కుడి కాలువ దర్శి నియోజకవర్గం నుంచి సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లోకి ప్రవేశిస్తుంది. కీలకమైన ఓబీసీకి దర్శి బ్రాంచ్ కెనాల్ నుంచే నీరు రావాలి. ఆ రకంగా చూసినా దర్శి ప్రకాశం జిల్లాలో ఉండడమే సమంజసమన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. తాజాగా అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయాలన్న ప్రతిపాదన వచ్చినందున దర్శి నియోజకవర్గం మొత్తాన్ని అద్దంకిలో కలిపి ఆ రెండు నియోజకవర్గాలను ప్రకాశంలో ఉంచాలన్న అధికారుల ప్రతిపాదనను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

నేటి నుంచి ప్రారంభం

ఒంగోలు విద్య, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పనితీరును మెరుగుపర్చేందుకు, ప్రధానోపాధ్యాయుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం సామాజిక తనిఖీలకు సిద్ధమైంది. జిల్లాలో సోమవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతోంది. అందుకోసం విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేశారు. పాఠశాలల రికార్డులన్నింటినీ పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై దృష్టి కేంద్రీకరించనున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇస్తోంది. తనిఖీలలో భోజనం నాణ్యత, గుడ్లు, చిక్కీలు, రాగిపిండి వంటి వాటిని పరిశీలించనున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటారు. పాఠశాలలకు రాని విద్యార్థులకు హాజరు నమోదు చేసినా, వారు మధ్యాహ్న భోజనం చేసినట్లు లెక్కల్లో చూపినా హెచ్‌ఎంలకు చిక్కులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

నేటి నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. అందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 6నుంచి 10వ తరగతి వరకూ ప్రశ్నపత్రాలను మండల విద్యావనరుల కేంద్రాల్లో, 1నుంచి 5 తరగతుల ప్రశ్నపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్ కేంద్రాల్లో భద్రపర్చారు. పరీక్ష ప్రారంభ సమయానికి గంట ముందుగా మాత్రమే ఆయా పాఠశాలలకు ప్రశ్నపత్రాల బండిళ్లను అందజేస్తారు. జూన్ నుంచి అక్టోబరు వరకు ఉన్న సిలబస్‌లోనే ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలు ఈనెల 19వతేదీకి ముగుస్తాయి. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈనెల 25కు పూర్తి చేసి 30వతేదీ నాటికి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు జారీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

కేంద్రం బృందం పర్యటన షెడ్యూల్ ఇదీ..

- సోమవారం ఉదయం 11.45 గంటలకు అమరావతిలోని సచివాలయం నుంచి జిల్లాకు బయల్దేరుతుంది.
- మధ్యాహ్నం 1.45గంటలకు ఒంగోలు చేరుకొనే బృంద సభ్యులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు.
- మధ్యాహ్నం 2.30నుంచి 3.15 వరకు ప్రకాశం భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మొంథా తుఫాన్ నష్టాలపై ఫొటో ప్రదర్శనను తిలకిస్తారు.
- మధ్యాహ్నం 3.35నుంచి 4గంటల వరకు కొత్తపట్నం మండలం అల్లూరు వద్ద దెబ్బతిన్న వరి పంట, ఆక్వా చెరువులు, ఆర్‌అండ్‌బీ రోడ్లను పరిశీలిస్తారు.
- 4.45 నుంచి 5.15 గంటల వరకు ఎన్‌జీపాడు మండలంలోని ఎన్‌జీపాడు, ఒమ్మెవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు.
- సాయంత్రం 6 గంటలకు చీరాల చేరుకుంటారు.

పశ్చిమాన నష్టం.. తూర్పున పర్యటన!

నేడు జిల్లాకు కేంద్ర బృందం రాక

- ఒక రోజుముందుకు మారిన షెడ్యూల్
- కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో పరిశీలన
- ఒంగోలులో అధికారులతో సమీక్ష
- అపార నష్టాన్ని మిగిల్చిన మొంథా
- నేటికీ కొన్నిచోట్ల తేరుకోని పరిస్థితి

ఒంగోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వల్ల వాటిల్లిన నష్టాల పరిశీలనకు సోమవారం కేంద్ర బృందం జిల్లాకు వస్తోంది. తొలుత ఈనెల 11న పర్యటిస్తుందని అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. మంగళవారం సీఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో కేంద్ర బృందం పర్యటనను ఒకరోజు ముందుకు మార్చినట్లు తెలుస్తోంది. మొంథా తుఫాన్ వల్ల జిల్లాలోని పశ్చిమప్రాంతంలో పంటలకు అధిక నష్టం వాటిల్లగా కేంద్ర బృందం పర్యటనను తూర్పు ప్రాంతంలో అదికూడా రెండు, మూడు గ్రామాలకు పరిమితం చేయడం విమర్శలకు తావిస్తోంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం కేంద్ర హోం మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పాసుమి బసు నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన బృందం సోమవారం ఒంగోలు చేరుకుంటుంది. మధ్యాహ్న భోజన అనంతరం ప్రకాశం భవన్‌లో జిల్లా అధికారులతో తుఫాన్ నష్టాలపై శాఖల వారీగా సమీక్ష చేస్తుంది. ఫొటో ఎగ్జిబిషన్‌ను బృంద సభ్యులు తిలకిస్తారు. అనంతరం కొత్తపట్నం మండలం అల్లూరులో దెబ్బతిన్న వరి పంట, చేపల చెరువులు, ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలిస్తారు. అక్కడి నుంచి నాగులుప్పలపాడు మండలం వెళ్లి నాగులుప్పలపాడు, ఒమ్మెవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రాత్రికి చీరాల చేరుకుంటారు. ఆమేరకు షెడ్యూల్ ఖరారైంది.

నివేదికలు సిద్ధం చేసిన అధికారులు

మొంథా తుఫాన్ నష్టాలను కేంద్ర బృందానికి శాఖలవారీగా సమర్పించేందుకు అధికారులు నివేదికలను సిద్ధం చేశారు. వారం క్రితం అందుకు సంబంధించి ప్రభుత్వానికి అధికారులు నివేదిక ఇవ్వగా దాని ప్రకారం జిల్లాలో రోడ్లకు భారీ నష్టం వాటిల్లింది. ఒక్క ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోనే రూ.180 కోట్ల విలువైన రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. మరో రూ.74 కోట్ల విలువైన పంచాయతీరాజ్ రోడ్లు, కల్వర్టులకు నష్టం వాటిల్లింది. అలాగే మునిసిపల్, విద్యుత్, పశు సంవర్ధక శాఖల పరిధి లోనూ నష్టాలు ఉన్నాయి. సుమారు రూ.12,200 హెక్టార్లలో వ్యవసాయ, మరో 900 హెక్టార్లలో ఉద్యాన పంటలకు కలిపి మరో రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో పంట నష్టాలు భారీగానే ఉన్నాయి. దాదాపు 20వేల హెక్టార్లలో పత్తి, మిర్చి, మొక్కజొన్న, సజ్జ, పొగాకు వరి తదితర పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. పాక్షికంగా మరో 20వేల హెక్టార్లలో నష్టం వాటిల్లింది. వేలాది హెక్టార్లలో పంట దిగుబడులు తగ్గిపోయి వాటిపై రాబడిని రైతులు కోల్పోనున్నారు. ఆరకంగా చూస్తే జిల్లాలో దాదాపు రూ.200కోట్లకు పైగా పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉన్న వరకే అధికారులు లెక్కించడంతో నష్టం పరిమితంగా కనిపిస్తోంది.


దోర్నాల మండలం తిమ్మాపురం వద్ద వర్షానికి కొట్టుకుపోయిన మిర్చి పంట(ఫైల్)

పశ్చిమంలోనే 90శాతం పంట నష్టం

పంట నష్టాలలో 90శాతం పశ్చిమ ప్రాంతంలోనే జరిగాయి. నేటికీ చాలా చోట్ల పంటలు కోలుకోలేదు. పొలంలోకి వెళ్లి రైతులు పనిచేసుకొనే పరిస్థితి లేదు. రోడ్లు, ఇరిగేషన్, ఇతర వనరులకు కూడా ఆ ప్రాంతంలోనే అధికంగా నష్టం వాటిల్లింది. అయితే కేంద్ర బృందం పర్యటన కొద్దిగంటలు అది కూడా తూర్పుప్రాంతానికి పరిమితం చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- రేపు లింగన్నపాలెంకు చంద్రబాబు
- ఎంఎస్‌ఎంఈ పార్క్ ప్రారంభం
- అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర
- పరిశీలించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ

పీసీపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపాలెం గ్రామం వద్ద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పార్కు (ఎంఎస్‌ఎంఈ)ను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో క్షేత్రస్థాయి పనుల్లో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రేయింబవళ్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. హెలిప్యాడ్ నిర్మాణం, స్టేజి ఏర్పాటు, పార్కింగ్ సౌకర్యాలు, సభకు వచ్చే ప్రజలకు వసతులు వంటి అంశాలపై ఆయన సమీక్ష చేశారు. సంబంధిత అధికారులకు తగు సూచనలు చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి కావాలని సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎక్కువ సంఖ్యలో ప్రజలు వస్తున్న నేపథ్యంలో వారికి అవసరమైన మౌలికవసతుల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు హెలిప్యాడ్ నిర్మాణాన్ని చేపట్టారు. సభావేదిక కోసం ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులో ఉన్న జంగిల్‌ను డోజర్‌తో తొలగిస్తున్నారు. ఆదివారం మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


'బోగస్'తో బాధితుల లబోదిబో

- రుణాలు తీసుకోకపోయినా బ్యాంకర్ల నోటీసులు
- మెప్మాలో ఆర్పీల చేతిలో మోసపోయి మహిళలు

సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం
7

ఎంఎస్ఎంఈలతో ఉపాధి, ఉద్యోగాలు

వలసలకు చెక్ పడే అవకాశం
7

కాళ్లపుండ్లతో జీవాల అవస్థలు




పొలానికి మేతకు వెళ్తున్న గొర్రెలు (పైన), కాళ్లగిట్టల్లో పుండ్లుతో నడవలేక ఇబ్బందిపడుతున్న గొర్రెలు

- సీజనల్ వ్యాధులతో సతమతం
- ఈ ఏడాది వర్షాలతో మరింత ఇబ్బందులు
- నడవలేక పదుల సంఖ్యలో దొడ్లలోనే..

కొండపి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రోజుల తరబడి కురిసిన భారీ వర్షాల కారణంగా మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రధానంగా గొర్రెలు, మేకలు, పొటేళ్లకు వర్షాలతో కాళ్లలోని గిట్టల మధ్యలో పుండ్లు పడి అవస్థలు పడుతున్నాయి. నెలరోజులుగా నీళ్లల్లోనే తిరుగుతున్న జీవాలకు ఈ దుస్థితి ఎదురైందని కాపరులు తెలిపారు. ఇప్పటికీ పొలాలకు మేత మేపునకు జీవాలను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉందంటున్నారు. అలాంటివి పదుల సంఖ్యలో జీవాలు ఇళ్ల వద్ద దొడ్లలోనే ఉంచుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి నివారణకు ఏ మందులు వాడినా తగ్గక అవస్థలు పడుతున్నాయని తెలిపారు. సహజంగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వర్షాకాలంలో జీవాలకు పుండ్లు వచ్చి తగ్గిపోతుంటాయని, ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వర్షాలు పడటమే కారణంగా తేలింది.

నాలుగు పిల్లలు చనిపోయాయి..



నా వద్ద 60 వరకు గొర్రెలు ఉన్నాయి. గ్రామంలో మూడు మందల్లో దాదాపు 200కుపైగా జీవాలు ఉన్నాయి. వాటిల్లో సగానికిపైగా గొర్రెలకు కాళ్లకింద పుండ్లుపడ్డాయి. ఈ ఏడాది అధిక వర్షాలతో నాలుగు పిల్లలు చనిపోయాయి. కాళ్ల కింది భాగంలో గిట్టల మధ్య తేమ కారణంగా పుండ్లుపడ్డాయి. మందులు తెచ్చి వేసినా తగ్గడంలేదు. ఇప్పటికీ పది గొర్రెలు నడవలేని స్థితిలో ఉన్నాయి. వాటికి మేతవేసి దొడ్డిలోనే ఉంచాను. మిగతా వాటిని మేత కోసం పొలానికి తీసుకెళుతున్నాను.

\- కొల్లి శ్రీను, కోయవారిపాలెం

వైభవంగా సాయిబాబా నగరోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిరంలో సోమవారం ఆచార్య ఎక్కిరాల భరద్వాజ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం రాత్రి సాయిబాబా, భరద్వాజ విగ్రహాలతో నిర్వహించిన నగరోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో విగ్రహాలను ఉంచి భక్తుల సాయినామస్మరణం, చిన్నారుల నృత్యప్రదర్శనల నడుమ నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి మాట్లాడుతూ షిర్డి సాయినాథుని లీలలు విశేషమైనవని, అదేవిధంగా ఆచార్య ఎక్కిరాల భరద్వాజ సాయినాథునిపై ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారని చెప్పారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షురాలు మల్లాది సుబ్బలక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, కార్యదర్శి మేడ జయరాం, ఉప కార్యదర్శి రుద్రవరపు సాయిబాబు, కోశాధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు గోపాలరావు, అంజయ్య, విజయ్‌కుమార్, చంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, సాయిరాజు, సుధారాణి, ప్రమీలాదేవి, వాసు ఆచారి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి భజన



పడిభజనలో పాల్గొన్న దీక్షాధారులు

ఒంగోలు(రూరల్), నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడి భజన అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా పడిపూజ మండపాన్ని దీక్షాధారులు ఎంతో అందంగా పూలమాలలతో అలంకరించారు. అర్చకుడు నారాయణం కళ్యాణ చక్రవర్తి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి దీక్షదారులు స్వామివారి భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కుంచా భరత్, సీతారామ్య, తోటకూర హరీష్, ఉప్పుటూరి సాయి, విప్పర్ల సాయి తదితరులు పాల్గొన్నారు

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కొండపి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ముప్పవరం గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు ఆదివారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమాన్ని ఈవో సాంబశివరావు నిర్వహించారు. పాలకమండలి కమిటీ చైర్మన్‌గా నేలపట్ల నరసింహమూర్తి, వైస్ చైర్మన్‌గా పిడుగూరి రామ్మూర్తి, సభ్యులుగా రావులపల్లి ప్రసాద్, నన్నూరి వెంకయ్య, ఉప్పుటూరి వెంకాయమ్మ, కాకుమాని పద్మ, మట్టిపాటి ఈశ్వరమ్మ, నిడమనూరి అనూష, నర్రారేఖ, బద్దిపూడి సదాశివశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణస్వామి పాల్గొన్నారు.

టంగుటూరు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయురాలు

టంగుటూరు(కొండపి), నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : అండర్-17 ఒంగోలు డివిజన్ 69వ స్కూల్ గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల్లో టంగుటూరు జడ్పీస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నామా అరుణ, క్రీడాకారులను హెచ్‌ఎం తులసీప్రభ అభినందించారు. ప్రతిభ చూపిన వారిలో ప్రణీత్, రిషితప్రియ, దీప్తి, షరోని, మహాలక్ష్మి, ప్రవల్లిక, నందినీ, ఈశ్వరమ్మ, ఎం.వి. మహాలక్ష్మి, రవితేజలు హ్యామర్, జావలిన్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్, 800 మీటర్ల రన్నింగ్, హర్డిల్స్ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

దొడ్డవరంలో జ్వరపీడితుల సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వృద్ధుడితో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది

మద్దిపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దొడ్డవరంలో గున్యా జ్వరాలు అనే వార్త ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో వైద్యసిబ్బంది స్పందించారు. ఈమేరకు గ్రామంలో జ్వర పీడితులను సర్వే నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. నీటితొట్టులు శుభ్రంగా లేకపోవటంతో ఖాళీచేయించి ఫాగింగ్ చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లబాడు, దొడ్డవరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ పూనూరు సుబ్బారావు ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రం, ఫాగింగ్ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య జ్వర పీడితులు సర్వే చేసి రక్తపరీక్షల నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో శ్రీనివాస రావు, ఏఎన్‌ఎం రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

ఒంగోలు, చీరాల ఎమ్మెల్యేలు దామచర్ల, మాలకొండయ్య



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు దామచర్ల, మాలకొండయ్య, ఒడా చైర్మన్ రియాజ్ తదితరులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యలు కొనియాడారు. ఆదివారం ఒంగోలులోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఢిల్లీ హైవే హోటల్‌లో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ 205ఏ ఆధ్వర్యంలో గాయత్రి శ్రీనివాస్ డిస్కాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ వాసవీ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగి అనేక సేవా కార్యక్రమాలతో పురోగమిస్తోందన్నారు. ఒంగోలు నగరంలో సైతం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయమని అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు, అదేవిధంగా ఆర్యవైశ్యులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన చెప్పారు. చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కాన్ఫరెన్స్ అధ్యక్షుడు కనమర్లపూడి హరిప్రసాద్ మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని అదేవిధంగా ఇప్పుడు ఉన్న క్లబ్ సభ్యుల సంఖ్యను రెట్టింపు చేయటం, పేద ఆర్యవైశ్య విద్యార్థుల చదువుకు సహకారం అందజేయటం వంటి అనేక ప్రణాళికలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గవర్నర్ గాయత్రి, సెక్రటరీ రాఘవేంద్రరావు ఆధ్వర్యం వహించగా కర్ణాటకకు చెందిన ప్రముఖ వైద్యురాలు సుజాత రమేష్, అబ్జర్వర్ సీఎస్.రవికుమార్, శిద్దా సూర్యప్రకాశరావు, ఒడా చైర్మన్ రియాజ్, సభ్యులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ గవర్నర్‌గా వేణు...



ప్రమాణ స్వీకారం చేస్తున్న వేణు

నాగులుప్పలపాడు: వాసవీక్లబ్ వి 205ఎ జిల్లా గవర్నర్‌గా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన అమరా వేణు ప్రమాణ స్వీకారం చేశారు. వల్లూరు వద్దనున్న ఢిల్లీ హోటల్‌లో ఆదివారం జరిగిన వార్షిక సమావేశంలో అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు శిద్దా సూర్యప్రకాశరావు, గవర్నర్ అమరా వేణుతో ప్రమాణ స్వీకారం చేయించారు. వేణును క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షుడు కొంజేటి వెంకటసురేష్‌బాబు సన్మానించారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే దామచర్ల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల అభివృద్ధికి తాను అన్నివిధాల సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వైఖానస సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని బైపాస్‌రోడ్‌లో గల వైఖానస ఆశ్రమంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణులలో ఇళ్లస్థలం లేని వారి వివరాలు తనకు అందజేస్తే అందరికీ ఒకేచోట ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. ముందుగా ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వైఖానస ఆశ్రమ నిర్వహణలో నగరపాలక సంస్థ తరఫున తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. వైఖానస నగర్‌గా ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్లో తీర్మానం పెడతామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పరాంకుశం కేశవాచార్యులు, ప్రధాన కార్యదర్శి ఆత్రేయ, గౌరవాధ్యక్షుడు గంజాం శ్రీనివాసమూర్తి, ఆయుర్వేద వైద్యులు హరిబాబు, ఎంవీ.శేషాచార్యులు, త్రినాథాచార్యులు పాల్గొన్నారు.

మేదర సంఘం ఆధ్వర్యంలో..

నగర మేదర సంఘం ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు రోడ్డులోని సదారామనామ క్షేత్రంలో ఆదివారం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, రుద్రాభిషేకం, చిన్నారులు, మహిళలకు వివిధ రకాల ఆటలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కేతా శేఖర్‌బాబు, కార్యదర్శి పిల్లి మధు, కోశాధికారి కేతా వెంకటనాగరాజు, కోన అనిల్, బీసీ కులాల అధ్యక్షులు పాల్గొన్నారు.



స్వామివార్లకు నమస్కరిస్తున్న మేదర సంఘ నాయకులు

కేంద్ర బృందం పశ్చిమ ప్రాంతంలో పర్యటించాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన పశ్చిమ ప్రాంతంలో కేంద్ర బృందం పర్యటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయంతిబాబు, పమిడివెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించేందుకు సోమవారం జిల్లాకు కేంద్ర బృందం వస్తోందన్నారు. పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, వైపాలెం, పుల్లలచెరువు, తర్లుబాడు తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని రైతులు కోలుకోలేని విధంగా ఉందని, అందువల్ల మిర్చి, పత్తికి ఎకరాకు రూ50వేలు తగ్గకుండా పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర బృందం ఒంగోలు పరిసర ప్రాంతాల్లోనే పరిశీలన చేసే విధంగా షెడ్యూల్ రూపొందించడం తగదన్నారు. అందువల్ల పశ్చిమ ప్రాంతంలో పరిశీలించి రైతులకు మేలు జరిగేలా చూడాలని వారు కోరారు.

ఘనంగా మంత్రి గొట్టిపాటి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసిన టీడీపీ శ్రేణులు



53 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అద్దంకి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 53 వ జన్మదిన వేడుకలను ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో నిర్వహించారు. అద్దంకిలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అద్దంకిలో టీడీపీ నేత లు 53 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. దివ్యాంగులు కేక్‌ను కట్ చేసి మంత్రి రవికుమార్ పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పాలకమండలి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేయిస్థంభాల గుడిలో దీక్షా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో రాష్ట్ర వ్యవసాయమిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మెగా ఉచిత కంటి వైద్యశిబిరంలో శంకర కంటి వైద్యశాల వైద్యులు 876 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 300 మందికి కంటి శుక్లాల ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. మరో 300 మందికి కళ్ళజోళ్ళు అవసరమని వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోయవారిపాలెం అడ్డరోడ్డు-జాళ్లపాలెం రోడ్డు అధ్వానం

- ఇబ్బందిపడుతున్న ప్రజలు



గుంతలమయంగా మారిన రోడ్డు

కొండపి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు- పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెట్లూరు దాటాక కోయవారిపాలెం అడ్డరోడ్డు నుంచి జాళ్లపాలెం వరకు దాదాపు 3 కిలోమీటర్ల గోతులమయంగా మారింది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డు ప్రాముఖ్యత గుర్తించి తారురోడ్డుగా మార్చింది. అప్పటి శాసనసభ్యుడు, ఇప్పటి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక శ్రద్ధతో తారురోడ్డుగా మార్చారు. ఈరోడ్డులో కోయవారిపాలెం వద్ద సిమెంటు రోడ్డు వేశారు. మిగతాది తారురోడ్డుగా మార్చారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో రోడ్డు తీర్చిదిద్దడంతో కాలక్రమంలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. తాజాగా తుఫాన్ సమయంలో కూడా తాటాకులపాలెం- చినకండ్లగుంట గ్రామాల మధ్య కొయ్యలవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈతరుణంలో పెట్లూరు, జువ్విగుంట, పరిసర 20 గ్రామాల ప్రజలు ఈరోడ్డులోనుంచి ప్రయాణం చేసి కొండపికి చేరుకున్నారు. అంతటి ప్రాధాన్యం గల రోడ్డు ఇపుడు గోతులమయంగా మారింది. తారులేచిపోయి రోడ్డు దెబ్బతింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ మండల అనుబంధ పదవుల భర్తీ

నాగులుప్పలపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండల పరిధిలో టీడీపీ అనుబంధ విభాగాల పదవులను ప్రకటిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. తెలుగుయువత మండల అధ్యక్షుడిగా జెట్టి వెంకటస్వామి, సహాయ కార్యదర్శి ధర్నాసి మోహనరావు, తెలుగురైతు అధ్యక్షుడిగా పోలినేని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కుంచాల రమేష్‌బాబు, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా గూడూరి ఝాన్సీ, సహాయ కార్యదర్శిగా కొండ్రగుంట నీలిమ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పోట్లూరి నాగమల్లేశ్వరావు, సహాయ కార్యదర్శిగా కరేటి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్‌బేగ్, సహాయకార్యదర్శిగా షేక్ కాలేషా, ఐటీడీపీ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి పవన్‌కుమార్, సహాయకార్యదర్శిగా ఉన్నం వెంకట సుబ్బయ్య, బీసీసెల్ అధ్యక్షుడిగా కుటుంబాకం సెల్వం, సహాయ కార్యదర్శిగా గుంజి కాంతారావు, ట్రేడ్ అధ్యక్షుడిగా తాళ్లూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కొంజేటి మారుతీరామ్ సుబ్బారావు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా కవిల వినోద్, సహాయ కార్యదర్శిగా ఆరే వాసుబాబు, కల్చరల్ సెల్ అధ్యక్షుడిగా బాచిన నాగేశ్వరావు, సహాయ కార్యదర్శిగా సింగోతు శ్రీనివాసులు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా తేళ్ల నయోమిలను నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం ద్వారా నియామక ఉత్తర్వులు అందజేశారు.

మద్దిపాడు మండల కమిటీల వివరాలు

మద్దిపాడు: తెలుగుదేశం పార్టీ మద్దిపాడు మండల అనుబంధ సంఘాలను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. తెలుగు యువత అధ్యక్షుడిగా నల్లూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కసుకుర్తి మహేంద్రబాబు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు రావి వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శిగా ఎండ్లూరి అంజయ్య, మహిళా అధ్యక్షురాలిగా దావులూరి హైమావతి, ప్రధాన కార్యదర్శిగా భూపతి తిరుపతమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నల్లబోతుల సుబ్బారాయుడు, ప్రధానకార్యదర్శిగా చలంచర్ల ప్రసాద్‌లను నియమించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వారిని అభినందించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలుకలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు తన నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం ఏడున్నరగంటలకు సంతపేటలోని సాయిబాబా గుడిలో మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో జరిగే శివపార్వతుల కళ్యాణ వేడుకల్లో పాల్గొంటారు. మంగళవారం ఉదయం పదిన్నరగంటలకు కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లిమండలం లింగన్నపాలెంలో జరిగే సీఎం చంద్రబాబు నాయుడు ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఒంగోలులోని మాగుంట తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

130 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

సంతనూతలపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 130మంది వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్.వంశీక్రిష్ణ, డాక్టర్ కె.స్వామిత్వపల్లవ్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్‌చైర్మన్ ఎన్ఎస్‌చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పంట నష్టాలను పరిశీలించనున్న కేంద్ర బృందం

నాగులుప్పలపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం సోమవారం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ సహాయ కార్యదర్శి పసుమి బాసు, ఆర్థికశాఖ అంచనాల డిప్యూటీ డైరెక్టర్ మహేష్‌కుమార్, హైవే, రవాణా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశాంక్ శంకర్‌రాయ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో శాస్త్రవేత్త సాయిభగీరథ్‌తో కూడిన బృందం సోమవారం సాయంత్రం 4 గంటలకు నాగులుప్పలపాడు, ఒమ్మెవరం గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలు పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారని ఎంపీడీవో వెల్లడించారు.

త్రైత సిద్ధాంత ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

పొన్నలూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్చూరివారిపాలెంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్తీక మాస ప్రత్యేకతపై ప్రజలకు అవగాహన కలిగించారు. దీపాలు వెలిగించడం ద్వారా అజ్ఞానాన్ని పారదోలడంతోపాటు ఆత్మజ్ఞానాన్ని పొందడమని వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి. ప్రసాద్, సభ్యులు కె.నరసింహులు, కొండలరావు, నాగమ్మ, మధు, రమణారెడ్డి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



నివాళి అర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్పీబీ కోటి స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ప్రముఖ గాయకుడు డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాలకు కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో కోటేశ్వరరావు, జి.శివప్రసాద్, బాలాజీ, ఎ.అశోక్, చంద్రశేఖర్, స్వర్ణలత, చిత్రశైలజ, డి.ఉషారాణి, శివప్రియ తదితరులు పలు చిత్రాలలోని పలు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పెండ్యాల సాయిమాస్టర్, ఎన్నూరి నాగేశ్వర రావు, ఆకుల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వెంకుపాలెంలో పారిశుధ్యం అధ్వానం

పొన్నలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకుపాలెంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. వర్షం పడినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. నెలల తరబడి మురుగు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దానికితోడు దోమలు విజృంభిస్తున్నాయి. సీసీ రోడ్లు వేశారే గానీ, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు అన్ని బజార్లలో పరిస్థితి ఇలాగే ఉందని చెబుతున్నారు. పాలకులు పట్టించుకోని కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల ఏర్పాటు ప్రాంతంలో వేగంగా జరుగుతున్న పనులు

ఎంఎస్‌ఎంఈలతో ఉపాధి, ఉద్యోగాలు

- వలసలకు చెక్ పడే అవకాశం
- కనిగిరి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో వేగంగా అడుగులు
- రేపు లింగన్నపాలెంలో పార్కును ప్రారంభించనున్న సీఎం

కనిగిరి ప్రాంతంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే స్థలాన్ని అన్వేషించటంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వేగంగా స్పందించారు. అంతేకాకుండా ఆ స్థలం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు అనువైనదిగా ఉండేందుకు కృషి చేసి కనిగిరి ప్రాంత నిరుద్యోగుల ఉపాధికి బాటలు వేశారు. అందులో భాగంగా ఈనెల 11న పీసీపల్లి మండలంలోని గుంటూరు లింగన్నపాలెంలో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పార్కును సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఇది కనిగిరి ప్రాంత ప్రజలు శుభపరిణామంగా భావిస్తున్నారు.

కనిగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ద్వారా వ్యవసాయం, సేవా రంగాల్లో వేగవంతంగా అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. అందులో భాగంగా ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా జిల్లాలోని కనిగిరి నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వటం ఈ ప్రాంత నిరుద్యోగుల్లో ఆశలను చిగురింప చేస్తోంది.

చొరవచూపిన డాక్టర్ ఉగ్ర

రాష్ట్రంలో వలసల ప్రాంతంగా పేరున్న కనిగిరి నియోజకవర్గం ఆర్థిక, వ్యవసాయ, ఉపాధి రంగాల్లో నిరాదరణకు గురైంది. గత పదేళ్ళుగా కనిగిరి ప్రాంతంలో ఉపాధి కల్పించే దిశగా ఏ పాలకుడు స్పందించక పోవటం ఈప్రాంత ప్రజలకు మరింత శాపంగా మారింది. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ కనిగిరి ప్రాంతంలో పర్యటించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రాంతంలోని ప్రతి సమస్యను నారా లోకేష్ ఆకళింపు చేసుకునే దిశగా గట్టిగా ప్రయత్నించారు. ఆసందర్భంగా కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామం వద్ద కార్మిక, కర్షక, శ్రామిక, వలసదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి లేక పరాయి ప్రాంతాల్లో ఉండి బతుకుతున్నామని, తల్లిదండ్రులను, పుట్టిన ఊరిని, ఉన్న ప్రాంతాన్ని వదిలి వలస జీవితాలు గడుపుతున్నామని పలువురు లోకేష్ ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కనిగిరి ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసల నివారణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై లోకేష్ ఐటీ శాఖామంత్రిగా పదవిని అలంకరించటం కనిగిరి ప్రాంత ప్రజలకు కలిసొచ్చింది. దీంతో మంత్రి లోకేష్ రాష్ట్రంతో పాటు కనిగిరి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు చేపట్టారు. మంత్రి లోకేష్ చర్యలకు అనుగుణంగా వచ్చిన అవకాశాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అందిపుచ్చుకోవటమే కాకుండా వాటికి బాటలు వేసేందుకు అనునిత్యం కృషిచేశారు. కనిగిరి ప్రాంతంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే స్థలాన్ని అన్వేషించటంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వేగంగా స్పందించారు. అంతేకాకుండా ఆ స్థలం కనిగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు అనువైనదిగా ఉండేందుకు కృషి చేసి కనిగిరి ప్రాంత నిరుద్యోగులకు ఉపాధికి బాటలు వేశారు. అందులో భాగంగా ఈనెల 11న పీసీపల్లి మండలంలోని గుంటూరు లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో చిన్నతరహా పార్కును సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఇది కనిగిరి ప్రాంత ప్రజలు శుభపరిణామంగా భావిస్తున్నారు.

ఎంఎస్‌ఎంఈలతో వలసల నివారణ

పీసీపల్లి మండలం గుంటూరులింగన్నపాలెం పరిధిలో ఎంఎస్‌ఎంఈ పార్కుల స్థాపనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కనిగిరి ప్రాంతంలోని జనాభాలో సగం మంది సొంత ఊరిని, కుటుంబాన్ని వదిలి దూరంగా ఉపాధి నిమిత్తం పరాయి ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారు. ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుతో ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఉద్యోగాలు సాధించే అవకాశం లభిస్తాయి. అందుకోసం ఇప్పటికే 56.53ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అందులో మొదటి ఫేజ్-1 కింద 20ఎకరాల్లో రూ.7 కోట్లతో చకాచకా పనులు చేపడుతున్నారు. భారీ పరిశ్రమల కంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియ సులభతరం కావడంతోపాటు ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి.

ఎమ్మెల్యే పర్యవేక్షణలో ఎంఎస్‌ఎంఈ ప్రారంభోత్సవ పనులు

పీసీపల్లి మండలంలోని లింగన్నపాలెం పరిధిలో ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 11న రానున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పర్యవేక్షణలో అందుకు తగిన ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం పరిశ్రమల పార్కు ఏర్పాటు ప్రాంతంలో తారు రోడ్డు వేశారు. సోమవారం విద్యుత్ సరఫరా పనులు నిర్వహించనున్నారు. కనీసం రోడ్డు వసతి కూడా లేని ఆప్రదేశాన్ని అన్నివిధాలుగా అనువైన ప్రదేశంగా తీర్చిదిద్దుతున్నారు. ఎక్స్‌కవేటర్లతో నేలను చదునుచేసి అనుకూలంగా మార్చారు. సీఎం చంద్రబాబునాయుడు ఆ ప్రాంతంలో ల్యాండ్ అయ్యేందుకు హెలిప్యాడ్ పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో పాటు జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, కనిగిరి డివిజన్‌స్థాయి, మండలస్థాయి అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి అవసరమయ్యే అన్ని సౌకర్యాలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమకూర్చారు.


పరిశ్రమల ఏర్పాటు ప్రాంతంలో పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, అధికారులు


అధికారులతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు శుభపరిణామం

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

పీసీపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పీసీపల్లి మండలంలో ఈనెల 11న జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి ఆదివారం మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. మంత్రి స్వామి మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు, బయోగ్యాస్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 11న పీసీపల్లితో పాటు రాష్ట్రంలో మరికొన్ని ఎంఎస్‌ఎంఈ పార్కులు వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా మార్కాపురంను కొత్త జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు కందుకూరు, అద్దంకిని ప్రకాశంజిల్లాలోనే ఉంచేందుకు డీపీఆర్ సిద్ధమైందన్నారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడంతోపాటు జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కె.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఏపీఐఐసీ ఎండీ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు

కన్వీనర్ల వ్యవస్థ రద్దు

- నియోజకవర్గ ఇన్‌చార్జులుగా పార్టీ ప్రధాన కార్యదర్శులకు బాధ్యతలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్ల వ్యవస్థను రాష్ట్ర పార్టీ రద్దుచేసిందని భారతీయ జనతాపార్టీజిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు తెలిపారు.స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత విషయాల్లో భాగంగా కన్వీనర్ల వ్యవస్థను రద్దు చేసిందన్నారు. పార్టీజిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఉన్న వారిని నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా నియమించారన్నారు. మార్కాపురం, దర్శి నియోజకవర్గాలకు జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోకొరెడ్డిని, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు మరొక జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ నారాయణలను నియమించామన్నారు. కొండపి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలకు మరో ప్రధాన కార్యదర్శి మాకినేని అమరసింహంను నియమించామన్నారు. త్వరలో అన్ని మండలాలకు కూడా కొత్తగా ఇన్‌చార్జులను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీరాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, పార్టీ జిల్లామాజీ అధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డిలు ఉన్నారు.

ట్రాఫిక్ సీఐగా జగదీష్

- వీఆర్‌కు పాండురంగారావు

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ట్రాఫిక్ సీఐగా జగదీష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న పాండురంగారావును వీఆర్‌కు పిలుస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జగదీష్‌కు ట్రాఫిక్ సీఐగా పూర్తిఅదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ మెమో జారీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న సుధాకర్‌కు సీసీఎస్ పోలీస్ స్టేషన్ బాధ్యతలు అదనంగా అప్పగించారు.

'బోగస్'తో బాధితుల లబోదిబో


- తీసుకోని రుణాలకు బ్యాంకర్ల నోటీసులు
- మెప్మాలో కొందరు ఆర్పీల మోసానికి గురైన సభ్యులు
- రూ. కోట్లలో దోపిడీ.. వేలల్లో బాధితులు
- సీఎంను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికపురోభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ, రుణాలు మంజూరు చేసి అండగా నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అమలు చేయాల్సిన పథకాలు కొందరు రిసోర్స్ పర్సన్లు పొదుపు సభ్యులను మోసం చేసి కోట్లు దిగమింగేస్తున్నారు. పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆధారంగా చేసుకుని, బ్యాంకులను బురిడీ కొట్టించి, బోగస్ గ్రూపులు సృష్టించి రూ. కోట్లు దోచేసిన సందర్భాలు కోకొల్లలు. కాగా ఇప్పటికే మెప్మా కేంద్రంగా చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు, బోగస్ గ్రూపుల బాగోతంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. ఇదిలా ఉండగా, దీంతో తాము మోసపోయామని ఆలస్యంగా గుర్తించిన కొందరు పొదుపు సభ్యులు ఆంధ్రజ్యోతిని ఆశ్రయిస్తుండగా, మరి కొందరు ఆ శాఖ ఉన్నతాధికారి వద్ద కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయితే బోగస్ గ్రూపులు సృష్టించి, కోట్లు దోచుకున్న ఆర్పీలపై చర్యలు మాత్రం నేటికీ శూన్యం.

సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం..!

ఆర్పీల చేతివాటంతో మోసపోయిన బాధిత మహిళలు ఒకొక్కరుగా తమకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి, ఒక్కటయ్యే పనిలో ఉన్నారు. ఇక్కడ అధికారులు న్యాయం చేయకపోవడం, విచారణ పేరుతో జాప్యం చేయడంపై వారు తీవ్ర నిరాశ చెందుతున్నారు. తాజాగా స్టేట్ బ్యాంక్ నుంచి కొందరు పొదుపు సభ్యులకు రుణం చెల్లించాలని నోటీసులు అందాయి. మరోవైపు గొల్లపాలెంకు చెందిన కొన్ని గ్రూపు సభ్యులకు తాజాగా పీడీసీసీబీ బ్యాంకు నంచి నోటీసులు అందాయి. ఐదేళ్లక్రితం బ్యాంకు నుంచి ఒక్కొక్కరు రూ. 6లక్షల వరకు రుణం పొందారు అందుకు సంబంధించి చెల్లింపులు లేవని, వారు నోటీసులు జారీ చేయడంతో తమకు తెలియకుండా తమ పేరుతో బ్యాంకులో రుణం ఎలా సాధ్యమని అవాక్కయిన సభ్యులు ఆర్పీ చేసిన మోసాన్ని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. తమకు అన్యాయం జరిగిందంటూ ఇటీవల కలెక్టర్ రాజాబాబును కలిసి వినతి పత్రం ఇవ్వగా, విచారణ చేయాలని కలెక్టర్ పీడీ శ్రీహరిని ఆదేశించారు.

అయితే గత కొన్ని నెలలుగా ఇదే తరహా ఫిర్యాదులు గ్రీవెన్స్‌కు రావడం, విచారణ చేయాలని ఉన్నతాధికారులు పీడీకి ఆదేశించడం ఆ తర్వాత విచారణ పేరుతో జాప్యం జరుగుతుండటంతో బ్యాంకర్ల ఒత్తిడి భరించలేని బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నేరుగా కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.


SBI
పొదుపు సభ్యురాలికి బ్యాంకు అధికారులు జారీ చేసిన నోటీసు

విచారణ పేరుతో జాప్యం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పొదుపు సభ్యుల సంక్షేమం, ఆర్థిక పురోభివృద్ధి కంటే వారి పేరుతో జరిగే దోపిడీనే అత్యధికంగా కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు ఆర్పీలు పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆధారంగా చేసి, ఆన్‌లైన్‌లో బోగస్ గ్రూపులు తయారు చేసి, బ్యాంకుల ద్వారా ఒక్కో గ్రూపు నుంచి రూ. 20లక్షల చొప్పున దోచుకున్న సందర్భాలు అనేకం ఉండగా, ఇటీవల అధికారులు ఆరా తీయగా, వందల్లోనే బోగస్ గ్రూపులు ఉన్నట్లుగా బ్యాంకర్లు కూడా నివేదికలు అందజేశారు. పొదుపు గ్రూపులపై పర్యవేక్షకులుగా పనిచేసే ఆర్పీలు సభ్యులను ఆసరాగా చేసుకుని బోగస్ గ్రూపులు తయారు చేసి, కోట్లకు పడగలెత్తారనేది బహిరంగ రహస్యం. అయితే అన్నీ తెలిసినా విచారణ చేసి, రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేసి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అధికారులు విచారణ పేరుతో నెలల తరబడి జాప్యంపై సభ్యుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడి అధికారులు కనీసం విజిలెన్స్ విచారణ కూడా కోరకపోవడంతో ముఖ్యమంత్రిని కలిసి న్యాయం చేయాలని పొదుపు సభ్యులు కోరనున్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాలవారిపాలెం గ్రామంలో వెలసిన హజరత్ నాసర్ వలి స్వామి గంధ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కులమతాలకు అతీతంగా పలు గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. భక్తులు దర్గా వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పవిత్ర కార్తీక మాసంలో గంధ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా భారీ విద్యుత్ ప్రభ, పాట కచేరీ అలరించింది. సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వేమన బందోబస్త్ ఏర్పాటు చేశారు.


ప్రార్థనలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) విద్యుత్ దీపాలతో అలంకరించిన దర్గా

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

జూదరుల అరెస్ట్

పొన్నలూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాలెం శివార్లలో కోడిపందెం ఆడుతున్న జూదరులను ఏడుగురిని ఆదివారం పట్టుకుని వారివద్ద 1610 రూపాయలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. వారిని సింగరాయకొండ కోర్టులో హాజరుపరుస్తామని వారు పేర్కొన్నారు.

త్రిపురాంతకేశ్వరునికి అన్నాభిషేకం

త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం చేశారు. కార్తీక మాసంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా త్రిపురాంతకేశ్వర స్వామికి అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



పృథులగిరి ఘాట్‌రోడ్డు సర్వే ప్రక్రియ ప్రారంభం

- రెండురోజులుగా ఓ ప్రైవేట్ సంస్థ పనులు

మర్రిపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డు నిర్మాణానికి తొలి అడుగు మొదలైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఇటీవల ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ డీఈ రమణయ్య, ఏఈ హనుమంతరావు పర్యవేక్షణలో విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ డీపీఆర్ సిద్ధం చేసేందుకు సర్వే ప్రక్రియ మొదలు పెట్టింది. రెండరోజులుగా ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం లెవల్స్ తీస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడుకిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కొత్తగా వేయనున్న రోడ్డులో 10 నుంచి 12 మలుపులు వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. కొండపై నుంచి జాలువారే నీటి ప్రవాహన్ని దిగువకు పంపేందుకు కల్వర్టుల నిర్మాణాన్ని అంచనాల్లో పొందుపరచనున్నారు. వాహనాలు కొండపైకి ఎక్కేందుకు ఘాట్‌ను సవరించనున్నారు. ప్రమాద నివారణ చర్యలను కూడా తీసుకోనున్నారు. మార్చి నెలలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఘాట్‌రోడ్డును పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. స్వామితోపాటు దామచర్ల సత్యలు ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులపై తరచూ పర్యవేక్షిస్తున్నారు. కార్తీక మాసం ముగిసేలోపు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అధికారులు నాయకులు సమాయత్తమవుతున్నారు.


ఘాట్‌రోడ్డు నిర్మాణానికి సర్వే చేస్తున్న అధికారులు


అన్నాభిషేకంలో స్వామివారు

మార్కండేశ్వరునికి అన్నాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వేదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు వరుణ్‌తేజశర్మ, ఆంజనేయ శర్మ మార్కండేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నాన్ని అభిషేకించారు. కార్యక్రమాన్ని ఈవో ఈదుల చెన్నకేశ్వరెడ్డి పర్యవేకించారు.

బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి

- కోతకు గురైన అలుగువాగు వంతెన
- కంభం చెరువు కట్టకు వెళ్లే ప్రయాణికుల అవస్థలు

కంభం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువు కట్టకు వెళ్లే దారి మధ్యలో ఉన్న అలుగు వాగు ఇబ్బందికరంగా మారింది. వివరాలలోకి వెళితే.. ఇటీవల మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు కంభం చెరువు పూర్తిగా నిండింది. 5అడుగుల ఎత్తులో ఉధృతంగా అలుగు కూడా పారింది. ఈ అలుగు నీరు మొత్తం గుండ్లకమ్మ వాగు ద్వారా కంభం చెరువు కట్టకి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో బ్రిడ్జిపై నుంచి 10రోజులుగా ప్రవహించింది. దీంతో బ్రిడ్జి, రోడ్డు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. దెబ్బతిన్న ఈ రహదారి బ్రిడ్జిపై నుంచి చెరువును చూసేందుకు వివిధ వాహనాలలో పర్యాటకులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వాగు అవతల ఉన్న అరటి తోటల నుంచి ట్రాక్టర్లలో, లారీలలో అరటి గెలలు తీసుకొచ్చే సమయంలో కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన రోడ్డును బ్రిడ్జికి మరమ్మతులు చేసి పర్యాటకుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


వరద ప్రవాహానికి కోతకు గురైన అలుగు వాగు బ్రిడ్జి


బహుమతులతో విద్యార్థులు

విద్యార్థులకు చదరంగం పోటీలు

గిద్దలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం చదరంగం పోటీలను నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో హర్షిత్, మనోజ్, ప్రణవ్, జూనియర్స్ విభాగంలో లలిత్, దానియేలు, అశ్విత్ విజేతలుగా నిలిచారు. విజేతలకు రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి బహుమతులను అందచేశారు. చదరంగం ఆడడం ద్వారా విజ్ఞానం పెరగడంతోపాటు నూతన ఆలోచనలకు బాటలు పడతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వాడాలి


కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులను మాత్రమే వాడాలని బీజేపీ నాయకులు కరపత్రాలను పంచిపెట్టారు. ఇంటింటికీ వెళ్లి మేక్ ఇన్ ఇండియా, మేడిన్ ఇండియా కార్యక్రమానికి చేయూతనిచ్చి స్వదేశీ వస్తువులను వాడాలని, విదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులను దూరం పెట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం ఇన్‌చార్జి బ్రహ్మనందరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, పట్టణశాఖ అధ్యక్షుడు ఉదయ్‌శంకర్, బీజేపీ నాయకులు రామాంజనేయులు, పుల్లయ్య, ఖాదర్‌వలి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్దూ భాషా దినోత్సవం



ఇక్బాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయం ఏకం చేసే భాష ఉర్దూ అని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉర్దూ భాషా దినోత్సవం రూట జిల్లా గౌరవ అధ్యకులు షేక్ సమీవుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉర్దూ రచయిత డాక్టర్ మహ్మద్.. ఇక్బాల్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరా రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో ఉర్దూ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇక్బాల్ జయంతిని ఉర్దూ డేగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉర్దూ నేషనల్ అవార్డ్ గ్రహీత ఫాతిమాబీబీని సన్మానించారు. కార్యక్రమంలో రూట జిల్లా అధ్యకుడు షేక్ అన్వర్ బాషా, పఠాన్ ముర్తుజా, షేక్ చంద్ బాషా, మొగల్ ఉల్సాన్ బేగ్, ముక్తజా, గఫాన్, రఫీ, జామిత మజ్జిద్ పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు తీర్చాలి

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంజీవనిగా పేరుగాంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఎంప్లాయిస్, సీఐటీయూ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అరబిందో నుంచి రావాల్సిన బాకాయిలు, లీవ్‌ల విషయంలో ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను ఇప్పించాలని కోరారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడితో పని చేయిస్తూ నిబంధనలను పట్టించుకోవడం లేదన్నారు. 104 సిబ్బంది న్యాయమైన డిమాండ్లను తక్షణమే తీర్చాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, వర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ నిర్ణయాలకు కట్టుబడి వారు చేసే తీర్మానాలకు సంఘీభావం తెలిపుతామని స్పష్టం చేశారు.

పలు కారణాలతో ఇద్దరు యువకులు ఆత్మహత్య

మార్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు ఈ నెల 4వ తేదీన దొనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన మొత్తుల చిన్నపోలయ్య కుమారుడు శ్రీనివాసరావు (20) ఈ నెల 6వ తేదీన తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన ఎం.శివకుమార్‌రెడ్డి (23) వ్యక్తిగత కారణాలతో గడిమందు సేవించారు. ఇద్దరినీ మార్కాపురం సర్వజన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య చికిత్సలు పొందుతూ ఈ నెల 8వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత వారిద్దరూ మరణించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ రాజాబాబు

పీసీపల్లి, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ను ప్రారంభించేందుకు ఈనెల 11న వస్తున్న ముఖ్యమంత్రి చం ద్రబాబునాయుడు పర్యటనకు అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్పీ హర్షవ ర్ధన్ రాజుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి లింగన్నపాలెం గ్రామ సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఆదివారం పరిశీలించారు. అనంత రం వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన నేపథ్యంలో తక్కువ సమయం ఉన్నప్పటికీ చిన్న సమస్య కూడా తలెత్త కుండా సాఫీగా జరగాలంటే అధికారులందరూ సమన్వ యంతో పనిచేసి శాఖలవారీగా కేటాయించిన విధు లను క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి సభ ముగించుకుని వెళ్లేంతవరకు అధికారులందరూ అప్ర మత్తంగా ఉండి వారికి కేటాయించిన విధులను సమ ర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలక్రిష్ణ, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, వి విధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


కోటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక గణపతి హోమం చేస్తున్న దంపతులు

ఘనంగా కార్తీక వనభోజనాలు

వైభవంగా సామూహిక హోమాలు

కంభం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా స్థానిక శ్రీ విశ్వనాథ కోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వనభోజన మహోత్సవానికి కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందుగా దేవాలయ ఆవరణలో ఉదయం 8గంటల నుంచి సామూహిక గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమాలు యజ్ఞశ్రీ పరాంశరం రామకృష్ణాచార్యులు, త్రిపురారిభట్ల ఆంజనేయ శర్మ జరిపించారు. పలువురు భక్తులు హోమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పొదిలి : కార్తీక వనభోజన వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతక్కి శివక్రిష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా శివ పార్వతుల కల్యాణం అత్యంత రమణీయంగా నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టంలోని విశ్వబ్రాహ్మణులు ఒకచోటకు చేరి ఆనందంగా కార్తీక వనభోజనాలను జరుపుకున్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వినుకొండ శ్యామల, ఆరికట్ల ప్రసాద్, గుత్తికొండ కల్యాణ్, ఒంగోలు చంద్ర పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ కాశీనాథ్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో రాణిస్తూ బలిజ సంఘ సభ్యులు ఐక్యంగా ముందుకు సాగితేనే అభివద్ధి సాధ్యమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. స్థానిక నరసింహ స్వామి కొండపై బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో అదివారం కార్తీక వన భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కాశీనాథ్ మాట్లాడుతూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుని నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాల్లికార్జున్, నాసరయ్య, ఘన శ్యామ్, నరసింహారావు, బెల్లంకొండ గోపి, ఇమ్మడి రవీంద్ర, తాడి బాలక్రిష్ణ, రఘుపతి శివ పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

పద్మశాలీల వన మహోత్సవం స్థానిక భావనరుషి స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతలు అందజేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యకుడు గంజి.రవీంద్రనాథ్, కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

జనగణనకు సహకరించాలి

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 2027లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జనగణనకు సంబంధించి పైలెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా పట్టణంలో 7వార్డులను గుర్తించామని తెలిపారు. అందులో 13, 14, 15, 16, 17, 18, 20 వార్డులు ఉన్నాయని తెలిపారు. ఒక్కో వార్డును మూడు బ్లాకులుగా విభజించి సూపర్‌వైజర్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు ఇళ్ల వచ్చేటప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి వివరాలను సక్రమంగా అందించాలని సూచించారు. మొత్తం 34 ప్రశ్నలతో కూడిన వివరాల నమోదుకు సహకరించాలని కమిషనర్ కోరారు.

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

కొమరోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 33/11కేవీ తాటిచెర్ల మోటు సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపల్లి గ్రామానికి నేడు అనగా సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఆర్‌డీఎస్ఎస్ కొత్త లైన్లు వేస్తున్న కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

లాడ్జి యజమానిపై దౌర్జన్యం

నలుగురిపై కేసు

ఎర్రగొండపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం బస్టాండు సెంటర్‌లోని శ్రీదుర్గ రెసిడెన్సీ లాడ్జి యజమాని గ్రంధిశిల వెంకటసుబ్బయ్యపై దౌర్జన్యం చేసి చంపుతామని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీ చౌడయ్య ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. భూమిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, మద్దుల శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి మరో వ్యక్తి కలసి లాడ్జికి వచ్చి అద్దెకు రూములు కావాలని సిబ్బంది హనుమంతునాయక్‌ను అడుగగా లేవని చెప్పడంతో దూషించారు. అక్కడే ఉన్న లాడ్జి యజమాని వెంకటసుబ్బయ్య ఎందుకు గొడవ చేస్తున్నారని ప్రశ్నించడంతో నలుగురిలో ఒకరైన మల్లారెడ్డి చేతితో ముఖంపై కొట్టాడని తెలిపారు. నన్ను చంపుతామని బెదిరించారని లాడ్జి యజమాని పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి అందాలను పరిరక్షిద్దాం

దిగువమెట్ట అటవీ ప్రాంతంలో వన విహారిని ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


దిగువమెట్టలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని అందాలను పరిరక్షించి, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం దిగువమెట్ట అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వనవిహారి ఉడెన్ కాటేజీలను ఆయన ప్రారంభించారు. తొలుత అక్కడ మొక్కలను నాటారు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మానవుని జీవన విధానం, జీవనశైలి ప్రకృతి నుండే ప్రారంభం అయిందని తెలిపారు. దిగువమెట్ట అటవీ ప్రాంతంలో జీవనం సాగించే కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఎఫ్ ఎఫ్‌డీపీటీ బి.విజయ్‌కుమార్ ఐఎఫ్ఎస్, ప్రాజెక్టు డైరెక్టర్ నిషా కుమారి, అనురాగ్, జి.విఘ్నేష్, పి.అంకయ్య, మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గోడి ఓబులరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మండలపార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, దప్పిలి భాస్కర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు శానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నాగదేవతల కల్యాణం


కల్యాణ అలంకరణలో నాగదేవతలు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులోని కల్యాణ నాగమయ్య స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా కల్యాణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహివంచారు. ఆలయ ప్రధాన అర్చకుడు పొన్నతోట శ్రీనివాస చార్యులు నాగదేవతలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ నాగమయ్య స్వామికి కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్నప్రసాదాలను వితరణ చేశారు.. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

పోలేరమ్మకు ఆదివారం బోనాలు



మార్కాపురం పట్టణ శివారులోని వెలసిఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం పోలేరమ్మ కు ప్రత్యేక జాతర బోనాలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారం మూలవిరాట్‌కు విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పొంగళ్లు వంటి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని నాగ శిలలకు, నాగుల పుట్టలకు పూజలు చేసి, పాలు పోశారు. కుంకుమ గుడులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశుల రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గంగమ్మ తల్లికి తెప్పోత్సవం


గంగమ్మకు పూజలు చేస్తున్న కృష్ణకిశోర్ రెడ్డి

రాచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములపల్లి గ్రామంలో 7సంవత్సరాల అనంతరం చెరువు నిండి అలుగు పారడంతో ఆయకట్టు చైర్మన్ శిరిగిరి శ్రీహరి-శ్రీలక్ష్మీ దంపతులు గంగమ్మ తల్లికి ఆదివారం తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి హాజరై గంగమ్మ తల్లికి వస్త్ర, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ తల్లి కరుణతో పుష్కలంగా వర్షాలు కురిసి గ్రామ ప్రజలందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్ప రంగసాయి, గ్రామ మాజీ సర్పంచులు వెనుతుర్ల రామకృష్ణారెడ్డి, భూపని కాశయ్య, టీడీపీ నాయకులు శిరిగిరి వెంకటపతి, స్థానిక పెద్దలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పెద్ద గురవయ్య, వెంకట రంగయ్య, పెద్ద నారాయణ రెడ్డి, చిన్న నారాయణ రెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకట రమణ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించి.. ఆదుకోండి

నల్లగుంట్ల రైతుల విజ్ఞప్తి


నల్లగుంట్లలో నేటికీ తడి ఆరని మిరప తోటలు

పెద్ద దోర్నాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ పోయి పది రోజులు కావస్తున్నా నేటికీ పంట పొలాల్లో వరద నీటి తడి ఆరడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోయిన పంటలను అధికారులు పరిశీలించి నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని నల్లగుంట్ల గ్రామానికి చెందిన రైతులు సీహెచ్ రామాచారి, బైరబోయిన మురళి, మద్దసాని పోలయ్య, రాజశేఖర్, సత్యాల భాలరంగయ్య, దొంగరి గాలెయ్య, శివ, టీ నరసయ్య, ఎం సాయినాయక్ మద్దుల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. నల్లమల అటవీ ప్రాంతానికి అతి సమీపంలోని గ్రామం కావడంతో వర్షాలు అధికంగా కురిశాయని, మూడు అడుగులకు భూగర్భ జలాలు పెరిగాయని, గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరుబావి నుంచి ఎలాంటి ప్రయత్నం చేయకుండానే ఏకధాటిగా నీరు వస్తోందన్నారు. తుఫాన్ వల్ల గ్రామానికి పదిహేను మంది రైతులకు చెందిన సుమారు 200ఎకరాల్లో మిరప తెబ్బతిన్నదని, యాభై ఎకరాల్లో మొక్కజొన్న పాడైపోయిందని తెలిపారు. ఇంత వరకు ఏఅధికారి కూడా గ్రామానికి రాలేదని నష్టపోయిన రైతులు వీఆర్‌వోను అడిగితే అగ్రికల్చర్ వాళ్లను అడగమని చెప్తున్నారని, వాళ్లను అడిగితే ఉద్యాన అధికారులను అడగాలని తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అధికారులు పంటలను పరిశీలించి ఆదుకునేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడిగా మారింది. పలువురు వాహనదారులు గంగమ్మ తల్లి వద్ద వాహనపూజలు చేయించుకున్నారు. మరికొందరు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మీ, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్‌పీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన పూజలను నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈసందర్భంగా ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో మహానైవేద్యాన్ని ఆలయ ప్రదర్శనచేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు కుంకుమలతో హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకతీయ కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు గుర్రం ప్రసాద్, ప్రధానకార్యదర్శి మానికొండ మల్లికార్జునరావు, కోశాధికారి దామా స్వాములు ఆధ్వర్యంలో దర్శి మున్సిపాలిటీలోని ఎస్ఏపీ చెరువు వద్ద సాయిబాబా ఆలయ ఆవరణలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. మండలంలోని వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. క్విజ్, ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ఆశ్రమానికి సరుకుల పంపిణీ

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని చలివేంద్ర కొండ వద్ద గల కాశీనాయన వృద్ధుల ఆశ్రమానికి రూ.40వేలు విలువచేసే సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరెడ్డి సభ్యుల సహకారంతో నిత్యావసర వస్తువులు, సీలింగ్ ఫ్యాన్లు, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి ఏ.నారాయణరెడ్డి, సభ్యులు కరుణా భాస్కర్‌రెడ్డి, రెడ్డిమాసు శ్రీనివాసరావు, సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

250 మందికి కంటి పరీక్షలు

పామూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): షుగర్ వల్ల వచ్చే కంటి నరం సమస్య పెరిగి అంధత్వానికి దారి తీస్తుందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ హెచ్.భారతి అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో నెల్లూరు మాడరన్ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 250 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహార్, క్యాంపు నిర్వాహకులు పాబోలు సుబ్రహ్మణ్యం, రమేష్‌తో పాటు డాక్టర్లు కె.తులసి, ఓ.రెవనరెడ్డి, జి.విష్ణుతేజ, పి.చిన్నయి, ఎం.సాయిరామ్‌చరణ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

కురిచేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్ - గుంటూరు మార్గంలో ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి కురిచేడు పీహెచ్‌సీలో చేర్పి మెరుగైన వైద్యం అందించారు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్ భర్తీ అనే వ్యక్తి శనివారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి పొట్లపాడు రైల్వే స్టేషన్ సమీపంలో జారి పడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా ఆదివారం ఉదయం ట్రాక్‌మెన్ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అతడు పడిపోయిన ప్రదేశానికి వాహనాలు వెళ్లే అవకాశం లేదు. దీంతో 108 ఈఎంటీ ప్రసాద్, పైలట్ జానీ బాషీలు అతడిని స్ట్రెచర్‌పై కిలోమీటరుకు పైగా మోసుకు వచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం కురిచేడు ప్రాథమిక వైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

» కలెక్టర్ రాజాబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

పీసీపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఈనెల 11న వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి లింగన్నపాలెం గ్రామ సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఆదివారం పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన నేపథ్యంలో తక్కువ సమయం ఉన్నప్పటికీ చిన్న సమస్య కూడా తలెత్తకుండా సాఫీగా జరగాలంటే అధికారులందరూ సమన్వయంతో పనిచేసి శాఖలవారీగా కేటాయించిన విధులను క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి సభ ముగించుకుని వెళ్లేంతవరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉండి వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలక్రిష్ణ, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



సీఎం పర్యటనపై పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పీసీపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో నిర్మించిన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఈనెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఎంఎస్ఎంఈ పార్క్‌ను పరిశీలించారు. హెలిప్యాడ్, రూట్ మ్యాప్, ప్రజావేదిక, వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రాకపోకల సమయంలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భద్రతా బలగాలకు విధుల కేటాయింపు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు సభకు వచ్చే ప్రజల రాకపోకలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఖాజావలి, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు ఎమ్మెల్యే జి.కోటయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరనున్న వైస్‌ఎంపీపీ

» గొట్టిపాటి లక్ష్మి దంపతులను కలిసిన వైసీపీ నేత ఐ.వెంకటేశ్వరరెడ్డి



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి దంపతులు

తాళ్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైస్‌ఎంపీపీ యిడమకంటి వెంకటేశ్వరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రమాదేవిలు వైసీపీ వీడనున్నారు. టీడీపీ మండల సీనియర్ నేతలతో కలిసి వెంకటేశ్వరెడ్డి దంపతులు ఆదివారం నరసరావుపేటలో డాక్టర్‌గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటేశ్వరెడ్డి కుటుంబం సుదీర్ఘంగా కాంగ్రెస్‌లో పయనించింది. ఆయన పెద్దనాన్న గుర్వారెడ్డి మండలాధ్యక్షులుగా, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం వెంకటేశ్వరెడ్డి కుటుంబం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. గుర్వారెడ్డి కుమారుడు ఐ.వేణుగోపాల్‌రెడ్డి వైసీపీ మండల అధ్యక్షుడిగా, గత ప్రభుత్వంలో దర్శి మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కొంత కాలంగా వెంకటేశ్వరెడ్డి వైసీపీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు.

మండలంలోని టీడీపీ నేతలు వైస్‌ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో తాళ్లూరు గ్రామానికి చెందినపార్టీ శ్రేణులతో చర్చించుకుని టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈవిషయాన్ని టీడీపీ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైస్‌ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రమాదేవి దంపతులు నరసరావుపేటకు వెళ్లి లక్ష్మి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడి టీడీపీలో చేర్చుకునేందుకు లక్ష్మి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నరసరావుపేటకు వెళ్లినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాచకొండ వెంకట్రావు, టీడీపీ బీసీసెల్ మాజీ అధ్యక్షుడు పిన్నిక రమేష్, నవులూరి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

నీటి కుంటల్లో సమృద్ధిగా నీరు



కొచ్చెర్లకోటలో నిర్మించిన నీటికుంటలో నిల్వఉన్న నీరు

దొనకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాటర్‌షెడ్ పథకం అమల్లో ఉన్న గ్రామాల్లో రైతుల పొలాల్లో తీసిన ఫారంపండ్స్ నీటి కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వర్షాభావ ప్రాంతాల్లో నిర్దిష్ట విధానాలతో వాన నీటిని సంరక్షణ చేసి భూగర్భ జలాలను పెంచటం కోసమే ప్రభుత్వం వాటర్‌షెడ్ పథకాలను ప్రవేశపెట్టింది. మండలంలోని కొచ్చెర్లకోట, సిద్ధాయిపాలెం, మంగినపూడి, మల్లంపేట, అనంతవరం గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం అమల్లో ఉంది. ఈపథకం ద్వారా ఆయా గ్రామాల్లో భూగర్భజలాలను పెంపొందించేందుకు రైతుల పొలాల్లో దాదాపు 250 ఫారంఫండ్స్, ప్రభుత్వ భూముల్లో దాదాపు 125 వరకు డకౌట్‌ఫాండ్స్‌ల నిర్మాణాలు చేపట్టారు. వీటిల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాటిలో నీరు చేరింది. ఆప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగటంతో పొలాల్లోని బోర్లల్లో నీరు సమృద్ధిగా ఉందని రైతులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మూగజీవాలకు తాగునీటి సమస్యకు ఇబ్బంది లేదని పశుపోషకులు పేర్కొన్నారు.

సీఐటీయూ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీఐటీయూ బలోపేతానికి ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. దర్శిలో సీఐటీయూ జిల్లా మహాసభల సందర్భంగా ఆదివారం జరిగిన ప్రతినిధుల సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబి స్తున్న అసంబద్ధ విధానాలవల్ల కార్మికులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. లేబర్ కోడ్ చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను రద్దు చేయటం దారుణమన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించి ఆమోదించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి చేయాలని, గ్రానైట్ పరిశ్రమను రక్షించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని నిర్ణయించారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు, డీకేఎం రఫి, పి.కల్పన, కె.శ్రీనివాసరావు, ఎం.రమేష్, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, జి.శ్రీనివాసులు, టి.రంగారావు, సందు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి వాస్తు దోషమట!

» ప్రవేశ మార్గం మార్పు



తహసీల్దార్ కార్యాలయానికి గతంలో ఉన్న ప్రవేశమార్గం



ప్రస్తుతం మూసివేసిన ఆమార్గం

కనిగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కనిగిరి తహసీల్దార్ కార్యాలయానికి వాస్తు దోషం పట్టుకుందని మార్పులు చేస్తున్నారు. 2014లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో పాత తహసీల్దార్ కార్యాలయం నూతన భవనంలోకి మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి డివిజన్‌గా మారటంతో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయంగా మార్చారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సమీపంలోఉన్న రెడ్‌క్రాస్ భవనంలోకి మార్చారు. కార్యాలయం ప్రహరీ పడమర వాయువ్య దిశలో ప్రవేశ మార్గం ఉంది. అప్పటినుంచి ఆ ప్రవేశ మార్గం నుంచే రాకపోకలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ మార్గానికి ఉన్న గేటును తొలగించి గోడ కట్టి, ఉత్తరం వైపు ప్రవేశమార్గం ఏర్పాటుచేశారు. దీంతో నగరంలో పెద్ద చర్చగా మారింది. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఇద్దరు తహసీల్దార్‌లను అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

కొనకనమిట్ల మండలంలో ఎఫ్‌ఏసీ గోడౌన్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న జయలక్ష్మీకి పదోన్నతి కల్పించి ఇటీవల కనిగిరి తహసీల్దార్‌గా నియమించగా, ఆమె విధుల్లో చేరారు. ఇక్కడే కొత్త చిక్కువచ్చి పడింది. ఇద్దరు తహసీల్దార్‌లు సస్పెండ్ కావటం ఆమెను ఆందోళనకు గురిచేస్తుంది. తహసీల్దార్‌ల సస్పెన్షన్‌కు అవినీతి అక్రమ మార్గం కాదని, కార్యాలయం ప్రవేశమార్గం వాస్తుదోషమని భావించి ప్రవేశం మార్గం మార్చడం చర్చనీయాంశంగా మారింది.



ఉత్తరం వైపు ఏర్పాటుచేసిన నూతన ప్రవేశమార్గం

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవలు

ముండ్లమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ మీట్ - 20 కార్యక్రమం ఆదివారం మండలంలోని శంకరాపురం పరిధిలో సయ్యద్ హాజీ మౌలాలి ఫామ్ హౌస్‌లో రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ సింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న విస్తృత సేవలను, కార్తీక మాసం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వీరవల్లి రుద్రయ్య, కాకాణి రాధాకృష్ణమూర్తి, బీవీ కృష్ణారెడ్డి, గంగాధర్, సయ్యద్ హాజీ మౌలాలి, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ చుండూరి మురళీ సుధాకర్, సందిరెడ్డి శ్రీనివాసరావు, దేవపాలన, లక్ష్మీరెడ్డి, అలహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరావు



కాళహస్తీశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

కాళహస్తీశ్వర స్వామికి అభిషేకాలు

కురిచేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో ఆదివారం స్వామి వారికి అభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కురిచేడు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం బ్రాహ్మణోత్తములు, వేద పండితులను ఘనంతగా సత్కరించారు.

వైభవంగా వీరభద్రస్వామి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి

ముండ్లమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి 9వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, నవగ్రహ మండపారాధన, స్వామి వారి పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

కమ్మ సేవాసమితి గౌరవాధ్యక్షుడిగా చెన్నయ్యచౌదరి

కనిగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకతీయ కమ్మసేవాసమితి నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా వీరపనేని చెన్నయ్యచౌదరి ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. కార్తీకమాస కమ్మ వనభోజన కార్యక్రమం ఆదివారం పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ కాకతీయ కమ్మ సేవాసమితి నూతన కార్యవర్గం ఎంపిక గోగడి రత్తయ్య ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా గుదే ఆదెయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శిగా గల్లా చెన్నయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఏలూరి నాగదీప్, కరణం అరుణమ్మ ఎంపికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా వీరపనేని పెద్దన్న, అడుసుమిల్లి ప్రభాకర్‌చౌదరి, నాగరాజు, ముప్పవరపు మాచర్లు, మన్నం రమణయ్య కోశాధికారిగా కొల్లూరి సురేష్‌లు ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. కార్యక్రమంలో గుంటుపల్లి దశరథరామయ్య, బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమిల్లి ప్రభాకర్‌చౌదరి, మన్నం రమణయ్య, ములకా నాగేశ్వరరావు, చెన్నుపాటి అంజయ్య, ఎర్రమోతు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి రవికుమార్ జన్మదిన వేడుకలు



కేకు కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు కడియాల రమేష్ జన్మదిన వేడుకలను మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం సత్యానందం, సీనియర్ నాయకులు కామేపల్లి చెంచయ్య, వైకే చౌదరి, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, సింగమనేని హనుమంతు, కుందుర్తి లక్ష్మణ్, పత్తి సుబ్బయ్య, బూరగ బాబు, బిల్లా రాజేష్, తదితరులు కేకు కట్ చేసి అభిమానులకు కేకు, స్వీట్లు పంచారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మంత్రి రవికుమార్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కామేపల్లి చెంచయ్య పేర్కొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో రక్తదానం

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మాలలు ధరించిన అయ్యప్ప స్వాములు వందమంది రక్తదానం చేశారు. గురు స్వాములు పర్యవేక్షణలో ఈరక్తదాన శిబిరం జరిగింది. ఆలయంలో దైవ కార్యక్రమాలతో పాటు నిరంతరం సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తు న్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగానే అన్నదాన కార్యక్రమంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాపాడబోయి ప్రమాదంలో పడ్డాడు!

» ప్రాణం మీదికి తెచ్చుకున్న మస్తాన్‌షరీఫ్



చికిత్స పొందుతున్న మస్తాన్‌షరీఫ్

కనిగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైనవారిని కాపాడబోయి కనిగిరి వాసి గాయాలపాలయ్యాడు. తెలంగాణ రాష్ట్రంలోని చిట్యాల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఈసంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పామూరు బస్టాండు వద్ద షేక్ మస్తాన్‌షరీఫ్ పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండ్లు కొనుగోలుచేసేందుకు శుక్రవారం కారులో హైద్రాబాద్‌కు బయలు దేరాడు. మార్గమధ్యంలో చిట్యాల సమీపంలోని ఎన్‌హెచ్65 రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి మరోకారు ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా బోల్తా పడగా, అందులోని ప్రయాణికులు హాహాకారాలు చేస్తున్నారు. ఇది గమనించిన మస్తాన్‌షరీఫ్ తన కారును రోడ్డు పక్కన ఆపించి అక్కడికి వెళ్లాడు. కారులో ఇరుక్కున్న ప్రయాణికుల పరిస్థితిని చూసి మస్తాన్‌షరీఫ్ చలించి పోయాడు. దారిన పోయేవారిని పిలిచి వారి సాయంతో ప్రయాణికులను బయటకు దించాడు. అందులో ఒక వ్యక్తి కారులో ఇరుక్కుపోయి బయటకు రావడానికి ఇబ్బందిగా మారింది. కారు అడుగు నుంచి కాలుతున్న వాసన వస్తుండటంతో అప్పటివరకు సాయం అందించిన వాహనదారులు భయపడి వెళ్ళిపోయారు.

మస్తాన్‌షరీఫ్ అతికష్టం మీద ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటికి తీశాడు. ఈసమయంలో ఒక్కసారిగా కారు దగ్ధమై పెద్దఎత్తున మంటలు రావటంతో మస్తాన్‌షరీఫ్‌కు అగ్నికీలలు అంటుకున్నాయి. తాను గాయాలపాలైనా ఆపదలో ఉన్న వారిని కాపాడి మానవత్వం బతికే ఉందని రుజువు చేశాడు. హైద్రాబాద్‌కు వెళ్లి ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. అక్కడి ఖర్చులు భరించలేక కనిగిరికి వచ్చి చికిత్స పొందుతున్నాడు.



శంకర్ ఆస్పత్రి.. సేవలు అసమాన్యం

- సామాన్యులకు అందుబాటులోకి నేత్రవైద్యం
- పెదకాకానిలో నేత్రాలయం ఏర్పాటు మన అదృష్టం
- నూతన బ్లాక్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



శంకర్ నేత్రాలయంలో అధునాతన మిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అసమాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆదివారం గుంటూరుకు సమీపం పెదకాకానిలోని శంకర్ నేత్రాలయంలో ఐ కేర్ సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెదకాకానిలో శంకర్ నేత్రాలయ ఏర్పాటు అదృష్టంగా భావించాలన్నారు. ఐదు రాష్ట్రాల్లో 14 ఆస్పత్రుల ద్వారా ఇప్పటి వరకు 70 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు జరిగాయని కొనియాడారు. సామాన్యులకు సైతం నేత్ర వైద్యం అందుబాటులో తీసుకొచ్చిన ఘనత కంచి కామకోటి పీఠానిదన్నారు. ప్రతిఒక్కరికీ కంటి వెలుగు అందేలా శంకర కంటి ఆస్పత్రి కీలకపాత్ర పోషించాలన్నారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని భావించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మానవసేవే.. మాధవసేవ

పేదరికం లేని సమాజం చూడాలన్నది జగద్గురు ఆది శంకరాచార్యుల కల. ఇది అసాధ్యం కాదు. అందరం అనుకుంటే సాధ్యం. దేశంలోని అన్ని పీఠాలకు కంచి కామ కోటి పీఠం ఆదర్శవంతం. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా కంచి పీఠాన్ని ఆదిశంకరాచార్యులు తీర్చిదిద్దారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి కంచి పీఠం వైద్య సేవలందిస్తుండటం స్ఫూర్తిదాయకం. కంచి పీఠం చేసే అన్ని కార్యక్రమాలకు అండగా ఉంటాం.

-ముఖ్యమంత్రి చంద్రబాబు

విద్య, వైద్యమే లక్ష్యం


విద్యార్థులకు నాణ్యమైన విద్య, రోగులకు మంచి వైద్యం, మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం అందించడమే తమ లక్ష్యమని కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. కంచి పీఠం తరపున చదువు, బలం, మంచిపేరు, కీర్తి, పుణ్యం తదితర ఐదు రకాల సేవలు నిత్యం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అనేకమైన ప్రార్థనలు, ప్రయత్నాలు ధర్మబద్ధంగా జరుగుతున్నాయన్నారు. విద్య, సంస్కృతి కలిపి శంకర స్కూల్స్ ప్రారంభం కానున్నాయని తెలిపారు. మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఆర్.వి .రమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సలహా మేరకు త్వరలో ఏఐ టెక్నాలజీ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, జీడీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, డాక్టర్ జేకే రెడ్డి, మురళీకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

సూర్యలంకలో.. పర్యాటకుల సందడి

- తీరంలో 40 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ ఉమామహేశ్వర్



తీరంలో పర్యాటకులు, టవర్‌పై నుంచి పరిశీలిస్తున్న ఎస్పీ బీ ఉమామహేశ్వర్

బాపట్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో ఆదివారంతో మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకులు, భక్తుల సందడి నెలకొంది. తుఫాన్ ప్రభావంతో 18 రోజులు తీరంలోకి పర్యాటకులను అనుమతించలేదు. ఈ క్రమంలో శనివారం నుంచి అనుమతించడంతో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కాగా తీరంలో భద్రతా ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పరిశీలించారు. మెరైన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలీసు, మెరైన్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో సముద్రంలోకి దిగడం, ఈతకొట్టటం నిషేధమని హెచ్చరించారు. తుఫాన్ తీవ్రత కారణంగా తీరంలో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉందన్నారు. కార్తిక సోమవారం పవిత్ర స్నానాలకు భక్తులు విశేషంగా విచ్చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తీరంలో ఎరుపు రంగు జెండాలను దాటి ఎవరూ లోపలకు వెళ్లరాదన్నారు. సముద్రం లోపల, తీరం వెంబడి గస్తీ నిమిత్తం 10 పడవలతో పాటు గజ ఈతగాళ్లను, బ్లూకోర్టు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. 40 సీసీకెమెరాలతో తీరంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సముద్రస్నానం మాత్రమే చేయాలని ఈతకొట్టరాదని, పోలీసుశాఖ సూచనలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు ఎం.శ్రీనివాసులు, పి.శేషగిరి తదితరులు ఉన్నారు.

కేంద్రం.. కరుణించేనా

- రేపు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
- మొంథా నష్టాలపై క్షేత్రస్థాయి పరిశీలన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



బాపట్లలో నీటమునిగిన దోస పైరు (ఫైల్‌ఫొటో)

మొంథా తుఫాన్ పంటలతో పాటు రహదారుల విధ్వంసం, విద్యుత్ రంగానికి భారీగా నష్టాన్ని మిగిల్చింది. తీర ప్రాంత గ్రామాల ప్రజలు, మత్స్యకారులు తుఫాన్ బాధితులుగా మిగిలారు. ఈ నేపథ్యంలో తుఫాన్ నష్టాలను పరిశీలించడానికి కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనున్నది. పంటలకు తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో కేంద్రబృందానికి చూపించి వ్యవసాయశాఖ వివరించనున్నది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయశాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నష్టాలను కేంద్ర బృందానికి వివరించడానికి సన్నద్ధమవుతున్నారు. తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా కేంద్ర బృందం ముందుంచేలా కలెక్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలో యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మొంథా ఏ స్థాయిలో జిల్లాపై విరుచుకుపడిందో ఆ బృందానికి వివరించి చెప్పడంతో పాటు, నష్టం లెక్కలపై వారు సంతృప్తి వ్యక్తం చేసేలా చూడాల్సిన బాధ్యత జిల్లాయంత్రాంగానిదే. ఉద్యాన పంటలతో కలిపి 39 వేల ఎకరాలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ఇప్పటికే తేల్చింది. విద్యుత్‌శాఖకు రూ.3 కోట్లు, రహదారుల మరమ్మతులకు రూ.15 కోట్లు, చెట్లు తొలగింపు, బాధితులకు రిలీఫ్ క్యాంపులు, ఆర్థిక సాయం, నిత్యావసరాల అందజేత వీటికోసం రూ.5 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఇక మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం, తీరంలో వ్యాపారాలకు గండి వంటివి నష్టాలకు అదనంగా ఉన్నాయి

కేంద్ర బృందం షెడ్యూల్ ఇలా...

సోమవారం రాత్రికే చీరాల చేరుకోనున్న కేంద్ర బృందం అక్కడి అతిథిగృహంలో బస చేయనుంది. మంగళవారం ఉదయం రామాపురానికి రోడ్డు మార్గంలో వెళ్లనున్న బృందం అక్కడ దెబ్బతిన్న పంటలను, రహదారులను పరిశీలించనున్నది. అక్కడి నుంచి వాడరేవుకు వెళ్లి ఛిద్రమైన రోడ్లను, కోతకు గురైన తీర ప్రాంతాన్ని పరిశీలించనున్నది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బాపట్లలోని కలెక్టరేట్‌కు కేంద్ర బృందం చేరుకోనుంది. అధికారులతో సమీక్ష అనంతరం మొంథా మిగిల్చిన నష్టాన్ని ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా బృందం పరిశీలించనుంది. మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర బృందం విజయవాడకు తిరిగి వెళ్లనున్నది.

ఘనంగా మంత్రి గొట్టిపాటి జన్మదినోత్సవం

53 కిలోల కేక్ కట్.. 876 మందికి కంటి పరీక్షలు



అద్దంకిలో 53 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నేతలు



మెగా ఉచిత కంటి వైద్యశిబిరం వద్ద బారులు తీరిన రోగులు

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆదివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ 53వ జన్మదినోత్సవాలు ఘనంగా జరిగాయి. అద్దం కిలో దివ్యాంగుల చేత టీడీపీ నాయకులు 53 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి కేక్‌ను కట్ చేయించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పాలకమండలి సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేయిస్తంభాల గుడిలో దీక్షా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అద్దంకిలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు 876 మందికి పరీక్షలు నిర్వహించి 300 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 300 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయమిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, టీడీపీ అద్దంకి మండల, పట్టణ అధ్యక్షులు మానం మురళీ మోహన్ దాస్, గరిగెల నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరి పరమేష్, చాగంటి రాజేంద్ర, కుందారపు రామారావు, సందిరెడ్డి రమేష్, కోనేటి అనిల్, చుండూరి మురళీసుధాకరరావు, గుంజి శ్రీనివాసరావు, లహరి, రామాంజ నేయులు, అత్తులూరి రమేష్, యేజెండ్ల నాగ రాజు, మాగులూరి గోపి, కొమ్మాలపాటి సుధీర్, నర్రా శ్రీనివాసబాబు, నాదెండ్ల సుబ్బారావు, కఠారి నాగేశ్వరరావు, పెంట్యాల రామాంజ నేయులు, కరిముల్లా, పూనాటి విక్రమ్, యర్రా రాఘవయ్య, గోగులమూడి రాజశేఖర్ పాల్గొన్నారు.

వెంగళాయపాలేనికి.. సరోవరం

- పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి
- పీఎంకేఎస్‌వై 2.0లో రూ.1.20 కోట్లతో పనులు
- ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు ఆదాయంపై ప్రయోగం
- ఇక్కడ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- చెరువు పరిశీలనకు రేపు కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక



చెరువు కట్ట ఆవరణలో కొబ్బరి, అరటి చెట్లను నాటుతున్న సిబ్బంది



గుంటూరు శివారులోని వెంగళాయపాలెం చెరువుకు మహర్దశ పట్టింది. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో చెరువుకు కేంద్ర ప్రభుత్వం వరమిచ్చింది. పిచ్చిచెట్లు.. గోతులు.. అపరిశుభ్ర పరిసరాలతో అధ్వానంగా ఉండే చెరువు సర్వాంగ సుందరంగా మా రింది. గతంలో గ్రామంలోని వారికే పట్టని చెరువు ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. పెద్దలకు ఆరోగ్యం, పిల్లలకు ఆహ్లాదకరం అందించడంతో పాటు స్వయం సమృద్ధి చెంది ఆదాయం ఆర్జించేలా అభివృద్ధి చేశారు. వాటర్ షెడ్ పథకంలో మోడల్ ప్రాజెక్టుగా వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ చేపట్టారు. చెరువు కట్ట పటిష్టంతో పాటు కొబ్బరి మొక్కలు, వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, జిమ్, పార్కు వంటి సౌకర్యాలతో నందనవనాన్ని తలపిస్తోంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 130 మంది ప్రతినిధులు రానున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని వాటర్‌షెడ్‌కు సంబంధించిన జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేయడంతో పాటు వెంగళాయ పాలెంలో వాటర్ షెడ్ పథకం కింద రూ.120 కోట్లతో చెరువు పునరుద్ధరణ చేశారు. దీంతో ప్రస్తుతం చెరువు పర్యాటక ప్రాంతంగా మారింది. 23.5 ఎకరాల్లో విస్తరించిన వెంగళాయ పాలెం చెరువును గతంలో గ్రామస్థులు తాగునీటి అవసరాలకు వినియోగించుకునేవారు. క్రమేణా గ్రామంలో తాగునీటికి ప్రత్యామ్నాయంతో పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీటి అవసరాలకే చెరువు


(మిగతా 8లో)



నల్లపాడు లయోలా పాఠశాలలో జరుగుతున్న వాటర్ షెడ్ మహోత్సవ సభ ఏర్పాట్లు



చెరువు ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు



వెంగళాయపాలెం చెరువు

అవీ..ఇవీ..

రాకపోకల పునరుద్ధరణకు చర్యలు



పేరాయపాలెం వద్ద గండికి గ్రావెల్ తోలుతున్న టిప్పర్

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరాయపాలెం వద్ద మొంథా తుఫాన్‌కు రోడ్డుకు పడ్డ గండి పూడ్చి రాకపోకల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా పెద్దగండి ఉండడంతో టిప్పర్లతో గ్రావెల్ తరలించి రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రెండు, మూడు రోజులలో రాకపోకలు పునరుద్ధరించనున్నారు.

అన్నదానానికి విరాళం

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అన్నదానానికి ఆదివారం దాతలు విరాళం అందజేశారు. శింగరకొండపాలేనికి చెందిన ఎర్రిబోయిన బాబురావు రూ.10,116, అద్దంకికి చెందిన బ్యాంక్ ఉద్యోగి కేవీ. సుబ్బారెడ్డి రూ.10,116లను అన్నదానానికి ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావుకు విరాళం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను సత్కరించారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానంలో అద్దంకి ప్రస్తావన

● డాక్టర్ చింతాడ బ్రహ్మనందరావు



చింతాడ బ్రహ్మనందరావును సన్మానిస్తున్న అద్దంకి నేతలు

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి రాసిన కాలజ్ఞానంలో అద్దంకి గురించి ప్రస్తావన ఉందని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు, సనారి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చింతాడ బ్రహ్మ నందరావు అన్నారు. ఆది వారం అద్దంకిలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యా లయంలో డాక్టర్ బ్రహ్మ నందరావును ఘనంగా సన్మానించారు. హైందవ సనాతన ధర్మాన్ని పరిరక్షిం చేందుకు, వైభవం తీసుకువచ్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. కాలజ్ఞానంలో అద్దంకి గురించి ఉన్న పలు విషయా లను వివరించారు. కార్య క్రమంలో చెన్నుపల్లి శ్రీనివాసాచారి, కొండపర్తి రాజశేఖర్, పొన్నపల్లి బ్రహ్మ నందం, రావూరి కోటేశ్వరరావు, కంచర్ల విష్ణువర్ధనాచారి, ఏలూరి వీరబ్రహ్మేంద్ర తదిరులు

చీపురు పుల్లల కోసం వెళ్లిన వృద్ధుడి మృతి

బల్లికురవ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): చీపురు పుల్లల కోసం కొండ ప్రాంతానికి వెళ్లిన వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని సూరేపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వృద్ధుడు దొడ్డా రామాంజనేయులు(65) తమ గ్రామానికి సమీపంలోని కొండకు వెళ్లి చీపురు పుల్లలు తెచ్చి చీపుర్లు కట్టి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగానే కొండకు వెళ్లాడు. అక్కడ గొంతు ఎండి అపస్మారక స్థితి చేరాడు. గొర్రెల కాపరులు చూసి 108కి సమాచారం అందించగా వారు వచ్చే సమయానికి వృద్ధుడు మృతి చెందాడు.

రోటరీ క్లబ్ సభ్యుల కుటుంబాల సమావేశం

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారు ముండ్లమూరు మండలం శంకరాపురం వద్ద ఉన్న సయ్యద్ హాజీ మౌలాలికి ఫామ్ హౌస్ వద్ద కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు రకాల పోటీలు నిర్వహించారు. లక్కీ డిప్‌లు తీసి బహుమతులను అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్ చేస్తున్న సేవల గురించి చర్చించారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ బాచిన శివ ధర పూర్ణచంద్రరావు, వీరవల్లి రుద్రయ్య, కాకాని రాధాకృష్ణమూర్తి, బీవీ కృష్ణారెడ్డి, గంగాధర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవ స్థాన చైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గాజుపాలెం పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాజుపాలెం అర్బన్ పీహెచ్‌సీ కాయకల్ప అవార్డుకు ఎంపికైందని, వైద్యులు గొట్టిపాటి జయ సింహా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 పీహెచ్‌సీలను ఈ అవార్డులకు ఎంపిక చేయగా అందులో గాజుపాలెం పీహెచ్‌సీ ఉందని అయన తెలిపారు.

మత్స్యకారులకు నిత్యావసరాల అందజేత

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన 20 మత్స్యకారుల కుటుంబాలకు ఆదివారం నిత్యావసర వస్తువులను నియోజకవర్గ ఐ టీడీపీ అధ్యక్షులు షేక్ కరిముల్లా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం మొంథా తుపానుతో దెబ్బతిన్న మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోనేందుకు నిత్యావసర వస్తువులను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశోక్, ఆది నారాయణ, మాథ్యుస్, ప్రసాద్, బలరామిరెడ్డి, ఆశీర్వాదం, ఫ్రాన్సిస్ పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

● మానవత్వం చాటుకున్న పోలీసులు

పర్చూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనాథ వృద్ధునికి అంత్యక్రియలు నిర్వహించి పోలీసులు మానవత్వా న్ని చాటుకున్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామాని కి చెందిన చీరాల శ్రీని వాసరావు అనే వృద్ధుడు అనారోగ్యంతో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆది వారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పర్చూరు ఎస్సై జీవీ.చౌదరి స్పందించారు. మేమున్నాం అంటూ తమ సిబ్బంది షేక్.నాగూర్, రవికుమార్ సాయంతో ముందుకు వచ్చి పర్చూరు హిందూశ్మశాన వాటికలో పర్చూరు పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు నిర్వహించారు.

అర్ధరాత్రి నిలిచిపోయిన ట్రావెల్స్ బస్

● ఐదు గంటల పాటు ప్రయాణికుల నరకయాతన
● ఆందోళనకు దిగిన ప్రయాణికులు



ఏల్చూరు వద్ద నిలిచిన బస్సు

ఏల్చూరు (అద్దంకి), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ సంత మాగులూరు మండలం ఏల్చూరు వద్ద సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్థానికుల కథనం మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 2.50 గంటల సమయంలో సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్దకు వచ్చింది. ఆ సమయంలో బస్సులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిచిపోయింది. ప్రయాణికులు డ్రైవర్‌ను ప్రశ్నించడంతో బస్ మరమ్మతులకు గురైందని, మరో బస్‌లో పంపిస్తామని చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటల వరకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఆందోళనకు దిగారు. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సంతమాగు లూరు ఏఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకొని ట్రావెల్స్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రయాణికులకు చార్జీ డబ్బులు వెనక్కు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని వెళ్లిపోయారు. ఐదుగంటల పాటు వేచి ఉండడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

టెన్నికాయిట్‌లో బాలబాలికల సత్తా

విజయవంతంగా ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ విభాగం పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్లో రెండురోజులుగా జరుగుతున్న 42వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ టెన్ని కాయిట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులకు భోజన, ఇతర సౌకర్యాలను నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిన్నవయసులో దూరాభారం ఆలోచించకుండా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. హోరాహోరీగా చిన్నారులు పోటీల్లో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పోటీల్లో ఒకరిద్దరు క్రీడాకారుల వైఫల్యాలను సున్నితంగా వివరించి పోటీ తత్వాన్ని తెలియజేశారు. పోటీల్లో బాలుర విభాగంలో వెస్ట్ గోదావరికి చెందిన పవన్ ప్రథమ స్థానం దక్కించుకోగా, రెండవ బహుమతి విజయనగరానికి చెందిన శివ శంకరప్రసాద్, మూడవ స్థానంలో కాకినాడకు చెందిన సత్యనారాయణ ఉన్నారు. అలాగే బాలికల విభాగంలో అనంతపూర్‌కు చెందిన జి. సుప్రియ ప్రథమస్థానంతో సత్తాచాటింది. రెండవ స్థానంలో అనంతపూర్‌కు చెందిన కే.జ్యోతిక, మూడవ బ ా ఎ ా తి విజయనగరానికి చెందిన ఇందు సాధించింది. దీంతో క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

చీరాల : తెలుగు సంవత్సరంలో కార్తీక మాసం అత్యంత పవిత్రమైనదని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. పేరాల ముత్యాలమ్మపేటలో యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసంలో సముద్రస్నానాలను పుణ్యకార్యంగా భక్తులు భావిస్తారన్నారు. నిర్వాహకుల ద్వారా ప్రత్యేక పూజలు, వన సమారాధనలో పాల్గొన్నారు. అలాగే రామాపురంలో నూతన రిసార్ట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పర్యాటక రంగాభివృద్ధికి రిసార్ట్స్ నిర్వహణ అవసరమన్నారు. అలాగే పచ్చ మొగిలిలో నిర్వహిస్తున్న యాదవ కార్తీక వన సమారాధనలో సీఐ సుబ్బారావుతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, యాదవ సామాజిక వర్గం ప్రముఖులు హాజరయ్యారు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యం



ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించాను. తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వ రమ్మ వ్యవసాయకూలీలు. నా కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. నేను దేశానికి గర్వకారణంలా నిలుస్తాను.

ఎం పవన్‌కుమార్, వెస్ట్ గోదావరి

అంతర్జాతీయ క్రీడాకారిణిలా ఎదుగుతా



అమ్మా, నాన్న రామాంజినమ్మ, వెంకటేశ్వర్లు రోజు వారీ కూలీలు. నేను ఉన్నతంగా ఎదగాలని నన్ను నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. చీరాల్లో నిర్వాహకులు చక్కని సౌకర్యాలు కల్పించారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడాకారిణిలా ఎదుగుతాను.

- జి సుప్రియ, అనంతపూర్

క్రీడల్లో ఔత్సాహికులకు ప్రోత్సాహం



నగదు సాయం చేస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలపట్ల ఔత్సాహికులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అందుకుంటారని వాకర్స్ అసోసియేషన్- 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరామక ప్రసాద్, ట్రెజరర్ లఘువరపు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తైక్వాండో పోటీల్లో ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి, ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో ఆడనున్న కేజీఎం విద్యార్థినీ షేక్ తాహిరాకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అసోసియేషన్ సేవలకు సంబంధించి అవార్డులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, శివరామ ప్రసాద్, వెంకటసుబ్బారావు, బాబాజీ రావు, సుభాషిణీ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస సత్యనారాయణస్వామి వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న అర్చకుడు

చినగంజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగా పార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి దేవస్థానం ప్రాగంణంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. దేవస్థాన ప్రాంగణంలో భక్తులకు కార్తీకమాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం

పేరాల(చీరాల), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో ఆదివారం జంగమ సంక్షేమ సంఘం కార్తీకమాస సామూహిక రుద్రాభిషేకములు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో విశేష పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించి, శివ సమారాధన చేశారు. అలాగే ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చేజర్ల శ్రీను, షణ్ముఖీ, బాల భాస్కర్, కిషోర్, మహేష్, సురేష్, రాజశేఖర్, శ్రీను, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలను పరిశీలించిన జేసీ



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న జేసీ భావన

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో, కడవకుదురు ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలను జిల్లా జాయింట్ కలెక్టర్ భావన ఆదివారం పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా వరద నీటికి మునిగిన వరి పొలాలను జేసీ పరిశీలించి, ఆయా ప్రాంతాల రైతులతో మాట్లాడారు. వరదనీరు ఎలా వచ్చింది, వరదనీటిలో పంటలు ఎన్ని రోజులు ఉన్నాయని ఆమె రైతులను అడిగారు. వరదనీరు సక్రమంగా పోయే మార్గం లేక వారం రోజులు వరద నీటిలో ఉన్నాయని, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరో పది వేలు ఖర్చుపెడితే పంట ఇంటికి వచ్చేదని రైతులు రైతులు దొడ్డక బాలకృష్ణ, శింగంశెట్టి శివన్నారాయణ, శేషు, మందారపు నాగేశ్వరరావు, నక్కల పాపయ్య, పాలెం సుబ్బారావు, తోటకూర నాగరాజు, వడ్లమూడి రామకృష్ణ, .అంజిబాబులు జేసీకి వివరించారు. కొమ్మమూరు కాలువకు మరల నీరు ఎప్పుడు విడుదల చేస్తారని రైతులు జేసీని అడిగారు. నీటిపారు దల శాఖ వారిని అడిగి తెలియజేస్తానని ఆమె రైతులకు తెలిపారు. వనద నీటిలో ఎన్ని రోజులు ఉంటే పంట దెబ్బతింటుందని, ఎకరాకు ఎన్ని బస్తాలు పండుతాయని ఆమె వ్యవసాయాధికారులను అడిగారు. కార్య క్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, చీరాల ఏడీఏ రత్నకుమారి, చీరాల ఉద్యానవన శాఖాధికారి అలేఖ్య, ఏవో చంద్రశేఖర్, వీఆర్‌వో కే.నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కుమార్తె మృతదేహం కోసం ఎదురుచూపులు



తండ్రి రామకృష్ణకు నగదు అందజేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

కారంచేడు (పర్చూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని టెక్సాస్‌లో మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) మృతదేహం కోసం కుటుంబ సభ్యులు నిరీక్షిస్తున్నారు. ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి ఇలా అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె ఇలా అకాల మృతిచెందడంతో తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కుమార్తె కడచూపైనా దక్కుతుందన్న ఆశతో గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. అయితే రాజ్యలక్ష్మి మృతదేహం గురువారం నాటికి స్వగ్రామం చేరుకుంటుందని బంధువులు తెలిపారు.

అకాల మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు స్థానిక సిద్ధార్థ వృద్ధ శరణాలయ ప్రతినిధులు ఆదివారం రూ.50వేల ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. తల్లిదండ్రులు, యార్లగడ్డ రామకృష్ణ, వాణీ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు దగ్గుబాటి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చాగంటి లక్ష్మీన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపాలేనికి.. సరోవరం

(5వ పేజీ తరువాయి)

పరిమితమైంది. దీంతో పశువుల సంచారంతో చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రూపం కోల్పోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువు చుట్టూ ఖాళీ స్థలంతో పాటు.. విశాలంగా ఉండటంతో జాతీయస్థాయిలో ఎంపిక చేసి, అమృత సరోవర్ అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు, చెరువులో చేపల పెంపకానికి కూడా చర్యలు చేపట్టారు. తద్వారా ఆదాయం కూడా ఆర్జించేలా చెరువును అభివృద్ధి చేశారు. కొబ్బరి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షలు, చేపల పెంపకం ద్వారా రూ.2 లక్షలు పంచాయతీకి సమకూరుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలుకు పాలకులు, అధికారులు ఆలోచన చేస్తున్నారు.

రేపు పరిశీలన.. సభ

రెండు రోజుల వాటర్‌షెడ్ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమవుతుంది. కాగా చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు కూడా రానున్నారు. ఆ తర్వాత వెంగళాయపాలెంలోని నల్లపాడు, లయోలా పాఠశాలలో వాటర్ షెడ్ మహోత్సవం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. చెరువుతో పాటు వెంగళాయపాలెం గ్రామంలో డివైడర్‌కు రంగులతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. లయోలా పాఠశాలలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీఆర్‌డీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణ బాధ్యతలు

● భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు అభిమానులు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నుంచి జ్ఞాపికను అందుకుంటున్న కృష్ణ

పర్చూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏపీఆర్‌డీసీ) డైరెక్టర్‌గా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి వెంకటకృష్ణారావు (కృష్ణ) ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ లోని ఆర్అండ్‌బీ శాఖ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చైర్మన్ నాగేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. అనంతరం మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావులు అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తన పదవికి కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మంత్రి రవికుమార్ జన్మదినం



బల్లికురవలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మేదరమెట్ల నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను కొరిశపాడు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో కేకు కట్ చేసి మంత్రి రవికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేదరమెట్లలో కేకు కట్ చేసిన సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొరిశపాడు ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.12 లక్షలు పరిహారం ఇప్పించిన ఘనత రవికుమార్‌దే అన్నారు. ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం కింద మండలంలోని పలు రహదారులను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెనుబోతు సత్యనారాయణ, ఏడెం భవాని ప్రసాద్‌రెడ్డి, మేదరమెట్ల శ్రీనివాసరావు, (శ్రీను పంతులు), కొట్టే రవీంద్ర చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల కోటేశ్వర రావు, కరిచేటి రాంబాబు, అవుల లక్ష్మి తిరుపతి, మేదరమెట్ల బ్రహ్మయ్య, చావా రాజేష్, హరిబాబు, శేషయ్య, వడ్లమూడి శ్రీనివాసరావు, శ్రీధర్, బీజేపీ నాయకులు సాతులూరి భావనారయణ పాల్గొన్నారు.

బల్లికురవ : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ జన్మదిన వేడుకలు టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేసి బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. మంత్రికి ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దేవినేని నరేంద్ర, బల్లికురవ సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, యాగంటి సింగరయ్య, దద్దాల అంజయ్య, నేతలు ఆళ్ల చంద్రమౌళి, చింతల రామారావు, గుంజి సుబ్బారావు, పెంట్రాల అంజనేయులు, వేల్పుల అబ్రహం, అమరనేని వినోద్, కత్తి ఆశోక్, గోగినేని వేణు, సొసైటీ అధ్యక్షులు కొమ్మాలపాటి రామారావు, మాలపాటి వెంకటసుబ్బయ్య,. విద్యాలయ ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల యాజమానులు ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారిలో కామేపల్లి ఎక్స్‌పోర్ట్సు అధినేత కామేపల్లి, లక్ష్మీప్రసాద్, గాయత్రి ఇండస్ట్రీస్ అధినేత దేవినేని శ్రీనివాసరావు, కలర్ గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం అధ్యక్షులు దూళిపాళ్ల శ్రీకాంత్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, పత్తిపాటి సురేష్, మాలపాటి పోతురాజు, శ్రీ నాగలక్ష్మీ ఫెర్టిలైజర్స్ యజమాని బెల్లంకొండ సుబ్బారావు, ఎస్‌ఐ వై. నాగరాజు, ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీవో కోటయ్యనాయక్, తహసీల్దార్ రవినాయక్, రేషన్ దుకాణ దారుల సంఘం నేతలు శ్రీకాంత్, బొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సంతమాగులూరు : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 51వ జన్మదిన వేడుకను ఆదివారం మండలంలో పొట్టవారిపాలెంలోని గొట్టిపాటి అతిథి గృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో సొంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, టీడీపీ నాయకులు చేవూరు వాసురెడ్డి, చింత రామారావు, అట్లా పెద్దవెంకటరెడ్డి దుద్దేల చిన్నగాలయ్య, వసంత వేణుబాబు, మురళి, కామాను శ్రీనివాసరావు పసుపులేటి కోటేశ్వరరావు పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పంగులూరు : ముప్పవరం బీసీ బాలికల వసతిగృహంలో మంత్రి గొట్టిపాటి పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం బాల, బాలికలకు పండ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గుర్రం ఆదిశేఖర్, నార్నె సుబ్బారావు, బత్తుల వెంకటరావు, గొల్లపూడి అంజయ్య, రావుల సింగరకొండ, పూనాటి రామాంజనేయులు, పెడవల్లి అశోక్, గుదిబండ్ల చినఆదిరెడ్డి, మద్దిరెడ్డి పిచ్చిరెడ్డి, దూళిపాళ్ల వెంకట్రావు, కోమటి ప్రసాద్, జక్రయ్య, ఉన్నం రవిబాబు, జాగర్లమూడి శ్రీనివాసరావు, వలపర్ల సుబ్బారావు, గడ్డం నాగేశ్వరరావు, ధూళిపాళ్ళ నారాయణస్వామి, కాటా అంజయ్య, అద్దెపల్లి యోహోను, అమృతపూడి ఏసోబు(చిన్న), ఎల్లాల నాగిరెడ్డి, కాజాస్వామి, బాచిన సురేష్, బాచిన హరిబాబు, వేల్పుల మరియదాసు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని చందలూరు, ముప్పవరం గ్రామాలలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పవరంలో మాలధారణ చేసిన స్వాములకు అన్నదానం చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, చందలూరులో గ్రామ సర్పంచ్ పెంట్యాల వెంకటకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు ఎర్రమనేని వాసవిశేషారావు, పార్టీ అధ్యక్షులు రావూరి వెంకటసుబ్బారావు, స్థానిక నేతలు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. ముప్పవరంలో నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్మోహన్, శింగరకొండ, జనసేన నాయకులు ఫణి, భానుప్రకాశ్, మరియదాసు, చౌదరిబాబు, శేషగిరి, పలువురు నాయకులు పాల్గొన్నారు. చిన్నమల్లవరంలో చిలుకూరి వెంకటేశ్వర్లు సారథ్యంలో మంత్రి జన్మదిన కార్యక్రమం నిర్వహించారు.





ముప్పవరంలో కేకు కట్ చేస్తున్న నాయకులు, మేదరమెట్లలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

టగ్ ఆఫ్ వార్ రన్నరప్ నెల్లూరు



అనంతపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. టగ్ ఆఫ్ వార్ పోటీలో నెల్లూరు జట్టు ద్వితీయ స్థానం సాధించి మంత్రులు అనగాని, పయ్యావుల నుంచి బహుమతి అందుకుంది.

హైవే విస్తరణ



- నెల్లూరు-తడ మధ్య ఎన్‌హెచ్‌కి మంచి రోజులు
- ఎట్టకేలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం
- ఆరు వరుసలుగా మార్చేందుకు నిర్ణయం
- డీపీఆర్ తయారీకి ఏజెన్సీ నియామకం
- చింతారెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబీకి గ్రీన్‌సిగ్నల్

నెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్ట మొదటగా ప్రారంభమైన నాలుగు వరుసల జాతీయ రహదారి నెల్లూరు-తడ బిట్. అయితే ఇప్పటికీ ఆ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. చుట్టు పక్కల రోడ్లన్నీ ఆరు వరుసలుగా నిర్మాణమవుతున్నాయి. చెన్నై, తిరుపతి, బెంగళూరు నగరాలకు రాకపోకలు అధికమయ్యాయి. అయినా నెల్లూరు-తడ మధ్య మాత్రం ఇంకా నాలుగు వరుసల రహదారితోనే ఆగింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెల్లూరు-తడ మధ్య ఉన్న 110 కిలోమీటర్ల బిట్‌ను ఆరు వరుసలుగా మార్చాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డీపీఆర్‌ను తయారు చేసేందుకు ఓ ఏజెన్సీని ఎంపిక చేసింది. ఏడాదిలోగా ఆ ఏజెన్సీ నివేదిక అందజేసేలా గడువు విధించగా, ఈనెలలో ఆ ఏజెన్సీ జిల్లాలో డీపీఆర్ తయారీని ప్రారంభించినట్లు జాతీయ రహదారుల సంస్థ వర్గాలు వెల్లడించాయి.

● ఎన్నాళ్లో వేచిన సమయం...

ఉత్తర-దక్షిణ భారతాన్ని కలపడంలో అత్యంత కీలకమైన రహదారిగా ఉంటూ, విపరీతమైన రద్దీ రహదారిగా మారుతున్న తరుణంలో ఎన్‌హెచ్-16(గతంలో ఎన్‌హెచ్-5)ను నాలుగు వరుసల నుంచి ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని పదిహేనేళ్ల నుంచి డిమాండ్లు ఉన్నాయి. ఈ రహదారి ప్రాముఖ్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఒక్క నెల్లూరు-తడ మధ్య మినహా మిగిలిన భాగం మొత్తాన్ని ఆరు వరుసలుగా మార్చింది. ఆరేళ్ల క్రితమే పూర్తిస్థాయిలో ఈ ఆరు వరుసల రహదారి అందుబాటులోకి వచ్చింది. విజయవాడ నుంచి నెల్లూరు వరకూ ఆరు వరుసల రహదారి ఉండగా, అక్కడ వరకూ వేగంగా వచ్చే వాహనాలు అక్కడి నుంచి నెమ్మదిస్తున్నాయి. మళ్లీ తడ తర్వాత ఆరు వరుసల రహదారి మొదలవుతుంది. ప్రస్తుతం జిల్లాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఆ ప్రభావం ఎన్‌హెచ్-16పై తీవ్రంగా ఉంటోంది. నెల్లూరు నుంచి విజయవాడకు 300 కిలోమీటర్ల దూరం ఉండగా 3:30 గంటల్లో చేరుకుంటున్నారు. అదే నెల్లూరు నుంచి చెన్నైకు 160 కిలోమీటర్లు ఉండగా మూడు గంటల సమయం పడుతోంది. అదే ఆరు వరుసల రహదారిగా మారిస్తే రెండు గంటల్లోనే చేరుకోవచ్చు. అదే సమయంలో ఇప్పుడు చాలా ఊర్ల దగ్గర ఫ్లైఓవర్ బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆరు వరుసల రహదారి విస్తరణ సమయంలో ప్రతీ గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది. కాబట్టి రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి. అదే సమయంలో ఈ ఆరు వరుసల విస్తరణ ఫలితం జిల్లా పారిశ్రామికీకరణకు ఎంతో దోహదపడుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నగరంలోని చింతారెడ్డిపాలెం వద్ద హైవే కూడలి



నెల్లూరులో ఇప్పటికే అయ్యప్పగుడి సెంటర్, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద జాతీయ రహదారిపై ఆర్‌వోబీల నిర్మాణం జరుగుతోంది. తాజాగా మరో కీలక జంక్షన్ అయిన చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద కూడా ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ముత్తుకూరు రోడ్డును కలుపుతూ ఇరువైపులా సర్వీసు రోడ్డు కూడా నిర్మించనున్నట్లు ఎన్‌హెచ్ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకుగానూ సుమారు

● చింతారెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబీ

రూ.121 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు సమాచారం. నెల్లూరు సిటీలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో చింతారెడ్డిపాలెం జంక్షన్ కూడా ఒకటి. చాలా కాలం నుంచి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలన్న డిమాండ్ ఉంది. జిల్లాలోని ఎంపీలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర సానుకూలంగా స్పందించి ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం కీలక పరిణామం. కాగా ఆర్‌వోబీ నిర్మాణం కోసం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మూడునాలుగు సార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి విన్నవించారు.

నెల్లూరు(సిటీ): నగరంలోని చింతారెడ్డిపాళెం క్రాస్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రభుత్వం ఆదివారం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. నగర ప్రజలకు ఇది శుభవార్త అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరణ్య రోదన



- అటవీ శాఖలో ఏళ్ల తరబడి భర్తీ కాని పోస్టులు
- ఉన్నవారిపై అదనపు పనిభారం
- 3,500 హెక్టార్లకు ఒక్కరే పర్యవేక్షణ

నేడు అటవీ అమర వీరుల సంస్మరణ దినం



నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పందిళ్లపల్లి శ్రీనివాసులు (ఐఎఫ్‌ఎస్) 1982లో కర్ణాటక రాష్ట్రంలో డీఎఫ్‌వో గా విధులు నిర్వహించేవారు. ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్‌లో మార్పుకోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. 1991లో నవంబరు 9న 'లొంగిపోతా.. నువ్వు ఒక్కడివే అడవిలోకి రావాలి' అంటూ వీరప్పన్ కబురు పంపాడు. డీఎఫ్‌వో శ్రీనివాసులు నవంబరు 10న అడవిలోకి వెళ్లాడు. వీరప్పన్ శ్రీనివాసులను దారుణంగా హత్యచేశాడు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన శ్రీనివాసులుకు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర బిరుదు ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతిఏటా నవంబరు 10న(నేడు) రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక కథనం.

త్వరలోనే పోస్టుల భర్తీ

త్వరలోనే జిల్లాలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించేందుకు అత్యాధునిక సంకేతికతను ఉపయోగిస్తున్నాం. అడవుల్లో మొత్తం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. సిబ్బందికి ఆయుధాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే రేంజర్లకు అందచేశాం.



- మహబూబ్‌బాషా, జిల్లా అటవీ అధికారి

● వెంటాడుతున్న ఉద్యోగుల కొరత

ఎర్రచందనం, వన్యప్రాణులు అటవీ సంపద. వీటి రక్షణ కోసం ఆటవీశాఖ ఉద్యోగులు కుటుంబాలను సైతం వదలి అడవుల్లో విధి నిర్వహణ చేస్తుంటారు. జిల్లాలో దాదాపు 2,82,000 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. ఉద్యోగులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నారు. 3500 హెక్టార్లకు ఒక్కరే రక్షణ కల్పించాల్సిన పరిస్థితి ఉంది. క్షేత్రస్థాయి ఉద్యోగాల భర్తీ జరిగి ఏళ్లు గడుస్తోంది. ఉన్న ఉద్యోగులు, సిబ్బందిపై పనిభారం పెరిగింది. ఎర్రచందన స్మగ్లర్లతో పోరాటం చేయాలంటే అత్యాధునిక ఆయుధాలు ఉండాలి. కానీ ప్రభుత్వం రేంజ్ అధికారి స్థాయిలో కొన్ని గన్‌లను అందించారు.కానీ క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు ఆయుధాలు అందించలేదు.

నేడు అమరవీరులకు నివాళులు

అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నెల్లూరులోని నిప్పో కూడలి వద్ద గల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించనున్నారు. నెల్లూరు రేంజర్ మాల్యాద్రి ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం మెగా వైద్య శిబిరంతోపాటు రక్తదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డొంక పోరంబోకే కదా...

దర్జాగా కబ్జా!

- స్థలం విలువ రూ. కోట్లలో..
- మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు
- ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

పొదలకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కబ్జారాయుళ్లకు అడ్డూఅపూ లేకుండా పోయింది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వం ఏదైనా అధికారులు మాత్రం తమ పంథా మార్చుకోవడం లేదు. వారు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. తాజాగా ఇలాంటి కబ్జానే పొదలకూరులో వెలుగు చూసింది. ఓ వ్యక్తి టైలర్స్ కాలనీ సమీపంలో దుకాణ సముదాయం పక్కన మెయిన్ రోడ్డు అనుకుని కొంతమేర స్థలాన్ని ఆక్రమించి రేకులు వేశాడు. అలాగే మెయిన్ రోడ్డు నుంచి వీవర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న డొంక పోరంబోకు స్థలం సుమారు 30 అంకణాల వరకు ఆక్రమించి పెన్సింగ్ రాళ్లు నాటాడు. ఆ స్థలం పక్కనే ఉన్న స్వర్ణ లేఅవుట్‌లో అంకణం రూ.3లక్షల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఆక్రమణ స్థలం విలువ దాదాపు రూ.కోటి పైన ఉంటుంది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో అక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొదలకూరులో అధికార పార్టీ నాయకులకు తెలియకుండా ఏమీ జరగదని, ఒకరిద్దరు అధికార పార్టీ నాయకుల ప్రమేయంతోనే ఈ స్థలం కబ్జాకు గురవుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

నెల్లూరురూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని వెల్లంటి చెరువులో ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు.. నెల్లూరులోని పొదలకూరురోడ్డు శివాజీనగర్‌కు చెందిన ఉయ్యాల సురేంద్ర (29) సజ్జాపురం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. భార్య, భర్తల మధ్య తలెత్తిన వివాదాలతో క్షణికావేశానికి గురైన అతను వెల్లంటి చెరువులో దూకి ఆత్యహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

బీటీఏ జిల్లా కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నెల్లూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా మణిసుబ్బు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా మాస ప్రసాద్, నిర్వాహక కార్యదర్శిగా వై శ్రీనివాసులు, కోశాధికారిగా డీ రాజశేఖర్, ఆడిట్ కార్యదర్శిగా టీవీ కృష్ణయ్య, మహిళా కార్యదర్శిగా ఆర్ భాగ్యమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు పదిమంది ఉపాధ్యక్షులు, ఐదుగురు మహిళా కార్యదర్శులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ తెలిపారు.

ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి

- రెండోపంటగా మొక్కజొన్న వేయాలి
- రాళ్లపాడు నీటి విడుదల సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ఆయకట్టు రైతుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. అనంతరం కుడి, ఎడమ కాలువల తూములు ఎత్తి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పైరు సాగు కోసం నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సోమశిల నుంచి నీరు విడుదల చేస్తే నాలుగు రోజుల్లో ప్రాజెక్టుకు వస్తాయని తెలిపారు. రెండో పంటగా రైతులు మొక్కజొన్న సాగు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు ఎం. వెంకటేశ్వర్లు, పీ. శేషయ్య, ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షుడు ఎన్. మాలకొండారెడ్డి, సుబ్బారావు, పీ బుచ్చయ్య, ఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము ఎత్తి నీటిని విడుదల చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, తదితరులు

● సోమశిలలో 71.895 టీఎంసీలు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 14,249 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 71.895 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో 58.46 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాంలో 58.46 టీఎంసీల నీరు ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 640 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

అమ్మో... కూరగాయలు !

- ఏదైనా రూ.100పైనే..
- కొనలేం.. తినలేం.. అంటున్న సామాన్యులు



కూరగాయలు	ధరలు (రూ...లో):
టమోటా	40
పచ్చిమిర్చి	70
దొండకాయ	120
బెండకాయ	120
వంకాయ	100
బీన్స్	160
కాకర	120
క్యారెట్	120
చిక్కుళ్లు	160
మునక్కాయ	200
బీరకాయ	120
బంగాళదుంప	60
ముల్లంగి	80

ఉదయగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల తీవ్ర వర్షాల కారణంగా ఇటు రైతులు, అటు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాల వల్ల రైతులు సాగు చేసిన కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీనికి తోడు కార్తీకమాసం కావడంతో మాంసాహారం తగ్గి శాకాహారం పెరిగింది. దీంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి.

● ఉత్పత్తి తగ్గడంతోనే...

ఉదయగిరి మార్కెట్‌లో వారం నుంచి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దొండ, బెండ, బీన్స్ కాకర, క్యారెట్ రకాలు కిలో రూ.100ల పైమాటే. రూ.100లు తీసుకెళితే కేవలం రెండు రకాల కూరగాయలు కూడా రావడంలేదని, పచ్చిడి మెతుకులే దిక్కయ్యాయని పలువురు వాపోతున్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ

- క్షేత్రస్థాయిలో ఆక్వా అథారిటీ, రెవెన్యూ పరిశీలన
- సబ్సిడీకి నిబంధనల అడ్డంకులు తొలగేనా...?

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులకు ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ పొందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అనే నిబంధన ఉంది. మంచినీటిలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా), ఉప్పునీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు కోస్టల్ ఆక్వా అథారిటీ(సీఏఏ) వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో సాగుచేసేవారు అనుమతి తీసుకోలేకపోయారు. ఇందుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఈ నిబంధనలను కొంచెం మార్పు చేసి ఆక్వా సాగు చేపడుతున్న రైతులందరికీ రూ.1.50 యూనిట్ ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

● రాయితీకి నిబంధనలు అడ్డు

జిల్లాలో మత్స్యశాఖ లెక్కల ప్రకారం 39,590 ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. ఇందులో 1802 ఎకరాల్లో ఉప్పునీటి, 21538 ఎకరాల్లో మంచినీటి ఆక్వా సాగవుతోంది. అయితే ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూముల్లో కలిసి దాదాపుగా 60వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుందని అంచనా. విద్యుత్ రాయితీ ఇవ్వడానికి గత ప్రభుత్వం ఆక్వా, నాన్ ఆక్వా జోన్లని అడ్డగోలు నిబంధనలు తీసుకొచ్చింది. నాన్ ఆక్వా జోన్‌లో రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ అందలేదు. దీంతో యూనిట్‌కు దాదాపుగా రూ.6ల నుంచి రూ.8ల వరకు వసూలు చేశారు. దీంతో సాగుదారులు బాగా నష్టపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం జోన్, నాన్ ఆక్వా జోన్ అనే పరిధి లేకుండా ప్రతి ఆక్వా రైతులకు రూ.1.50లకే విద్యుత్ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి సీఏఏ, అప్సడా వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనే నిబంధనల తీసుకొచ్చింది.



● అడ్డంకులు తొలగేనా..?

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలతో కొంత మంది అర్హులకు విద్యుత్ రాయితీ అందడం లేదనేది తెలిసిన విషయం తెలిసిందే. సీఏఏ, అప్సడా నుంచి జిల్లాలో దాదాపు 50శాతం వరకు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన 50శాతంలో సాగు చేస్తున్న రైతులకు రిజిస్ట్రేషన్ కాలేదు. ఐదేళ్ల గడువు ముగిసిన కొందరు రైతులు రెన్యువల్ చేయించుకోకపోవడం ఒక కారణం. అదేవిధంగా ప్రభుత్వ, అసైన్డ్, డీకేటీ, అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు ఎలాంటి అనుమతులు లేవు. రైతులకు విద్యుత్ రాయితీ అందాలంటే వెబ్ ల్యాండ్‌లో కనిపించాలి. సాగు చేస్తున్న రైతు పేరుమీద విద్యుత్ బిల్లు ఉండాలి. కనీసం 1బి అడంగల్ ఉండాలి. కొన్ని గ్రామాల్లో సాగుదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదు. రీసర్వే చేసి సరిచేస్తామని చెబుతున్నారే తప్ప అడుగు ముందుకు పడడం లేదు. దీంతో అర్హులైన ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందడం లేదు. ఈ క్రమంలో నిబంధనలు సడలించే అవకాశం ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252
కోడిగుడ్ల ధర (100)	600

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,520
వెండి కిలో ధర రూ. 1,51,600
వెండి ఒక గ్రాము రూ.157.60

క్రీడాకారులను ప్రోత్సహించాలి

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి క్రీడాకారుడికైనా ప్రోత్సాహం ఉంటేనే ముందుకు వెళ్లేందుకు దోహదపడుతుందని బీఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు సమీఉల్లా అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలోని తైక్వాండో వాకర్స్ సభ్యులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన ఇంటర్‌నేషనల్ మాస్టర్ ఈ.రవిగన్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, సభ్యులు కే.శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎం.శ్రీనివాసులు, బీ.సుధాకర్, ఆర్‌ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెలా..?

- రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీటి పథకం నుంచి రంగుమారిన నీరు సరఫరా
- కలుషిత నీటితో ప్రజల భయాందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీటి పథకం నుంచి సరఫరా జరిగిన రంగుమారిన నీరు

వలేటివారిపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు రక్షిత తాగునీటి పథకం నుంచి రంగు మారిన కలుషిత నీరు సరఫరా జరుగుతుంది. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలలోని 38 గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సుమారు రూ.4 కోట్లతో రాళ్లపాడు-రోళ్లపాడు రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. అప్పట్లో ఈ పథకం ప్రజలకు బాగా ఉపయోగపడింది. తదనంతరం పథకం నిర్వాహణ లోపంతో సక్రమంగా పనిచేయడం లేదు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. గత నెల రోజుల క్రితం ప్రజలు, ప్రజాప్రతినిధులు తాగునీరు కలుషింపై అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్లోరినేషన్ చేయాలనే ఉద్దేశ్యంతో అధికారులు పది రోజుల పాటు తాగునీరు సరఫరా నిలిపివేశారు. అయితే క్లోరినేషన్‌కు ముందు తాగునీరు పసుపు రంగులో వచ్చేది. క్లోరినేషన్ చేసిన తరువాత ఎర్రగా సరఫరా అవుతుంది. ఆ తాగునీరు చూసి ప్రజలు ఈ నీరు తాగేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఈ రంగుమారిన కలుషిత నీరు తాగితే రోగాలు బారిన పడడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. కనీసం పశువులు కూడా తాగనంతగా కలుషిత నీరు సరఫరా అవుతుంది. తాగునీటి పథకం నిర్వాహణంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా కుళాయిల్లో పసుపు, ఎరుపు రంగు, దుర్వాసనతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వానికి ఫ్యాప్టో కృతజ్ఞతలు

కావలి(టౌన్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కోరుతూ రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయడం పట్ల ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు కంచర్ల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని ఆదావారం ఆయన నివాసంలో కలిసి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. చట్టంలో మార్పు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవల్సిందిగా ఎమ్మెల్యే ద్వారా రాష్ట్రప్రభుత్వానికి అభ్యర్థించారు. విద్యాశాఖలోని కొంత మంది వివిధ స్థాయి అధికారులు తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాల వల్ల ఉపాధ్యాయ వర్గంలో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వస్తుందన్న విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఏ.రామారావు, టీ.హరికృష్ణ, ఆర్‌కే.ప్రసాద్, ఎం.మస్తానయ్య, జ్ఞానశేఖర్, శివకృష్ణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటిన మణికంఠ



గోల్డ్, సిల్వర్ పతకాలతో మణికంఠ

సీతారామపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆదివారం జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ కాంపిటీషన్ కమ్ సెలక్షన్స్ స్విమ్మింగ్ పోటీల్లో సీతారామపురంలోని బెస్తకాలనీకి చెందిన కానిస్టేబుల్ చెన్నయ్య కుమారుడు పామనబోయిన మణికంఠ సత్తా చాటాడు. అండర్ 19 స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ కాంపిటీషన్స్‌లో ఏకంగా రెండు బంగారు, ఒక సిల్వర్ పతకాలను చేజిక్కించుకుని, ఈనెల 30 నుంచి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా మణికంఠను బెస్త కాలనీవాసులు అభినందించారు.

అట్టహాసంగా కాటంరెడ్డి జన్మదిన వేడుకలు

అల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఆయన నివాసంలో అట్టహాసంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణు తండ్రి ప్రజాసేవలోనే తనువు చాలించాడని, ఆ మహనీయుడి కుమారుడు విష్ణు కూడా ప్రజాసేవలోనే ఉన్నారని, అలాంటి నాయకులు దొరకడం నేటి రోజుల్లో కష్టతరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంత రాజు బాలకృష్ణంరాజు, సతీష్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దండా కృష్ణారెడ్డి, మాధవరావు, పప్పు సుధాకర్, చల్లగుంట్ల సుధాకర్, బత్తల మోహన్‌రరెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

కావలి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కావలి మండలం కొత్తపల్లిలో ఆదివారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు యర్రా మాల్యాద్రి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగవర్పమ్మకు పూజలు



నాగవర్పమ్మను దర్శించుకుంటున్న మహిళలు

సంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న నాగవర్పమ్మ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంజాయి, జూదం, బెట్టింగ్‌రాయుళ్లపై రౌడీషీట్లు ఓపెన్ చేయండి

- నేర సమీక్షలో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ, హాజరైన సీఐలు, ఎస్‌ఐలు

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో పేకాట, కోడి పందేలు లాంటి జూదం నిర్వహణ, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో యువతను ఆర్థికంగా దివాళాతీయిస్తున్న వ్యక్తులపై గట్టి నిఘా పెట్టి రౌడీషీట్లు ఓపెన్ చేయాలని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆదేశించారు. స్థానిక సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో ఆదివారం జరిగిన కందుకూరు డివిజన్‌స్థాయి నేర సమీక్ష సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ జూదాలు, బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. గంజాయిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యకలాపాలు ఏ పోలీసుస్టేషన్ పరిధిలో జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రాపర్టీ కేసులు, దొంగతనాలు, యాక్సిడెంట్ కేసులలో దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లలకు సంబంధించిన కేసులు, పోక్సో కేసులు, సైబర్‌నేరాలు, చీటింగ్ కేసుల్లో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి జైలుకు పంపించాలన్నారు. సోషల్‌మీడియా గ్రూపులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, ఆరుగురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అలరించిన అయ్యప్పస్వామి భజన



అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట ద్వారకానగరులోని షిరిడీ శేషసాయి మందిరంలో ఆదివారం అయ్యప్పస్వాముల భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తీక మాసం కావడంతో మందిరావరణంలోని జంటనాగుల శిలల వద్ద తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. స్థానికులు కుట్టుబోయిన మహేంద్రబాబు, శ్రీజల కుమారుడు వశిష్ఠనారాయణ పుట్టిన రోజు సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు, వృద్ధాశ్రమంలోని పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటరమణమ్మ, మందిర వ్యవస్థాపకులు బ్రహ్మానందం, వసుంధర దంపతులు, సాయిభక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఆదివారం స్థలం పరిశీలించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గాంధీజనసంఘంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఇటీవల రూ.32 లక్షల మంజూరు చేయించారు. దీంతో పంచాయతీ రాజ్ డీఈ సుధార్‌రెడ్డి, ఏఈ రామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డిలు స్థలం పరిశీలించి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు మానికల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట దళితవాడకు చెందిన ఉదయగిరి శ్రీనివాసులు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి వంటపాత్రలు, నూతన దుస్తులు, టార్పాలిన్‌తో కూడిన రిలీఫ్ కిట్‌ను కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే.హరినారప రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, గొట్టిపాటి మనోరమ, జీవిత సభ్యులు బెజవాడ అబిసాగర్ పాల్గొన్నారు.



దుస్తులు, వంటపాత్రలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

త్వరలో ప్రకాశం జిల్లాలోకి కందుకూరు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గం త్వరలోనే ప్రకాశం జిల్లాలో కలవబోతున్నదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో అప్పటి పాలకులు ఇక్కడి ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా నెల్లూరు జిల్లాలో కలిపారని, అయితే వారు చేసిన తప్పులను తాము సవరిస్తున్నామని పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో త్వరలోనే మరో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు ప్రభుత్వం నుంచి రూ.3కోట్లు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.5 కోట్ల రాబోతున్నాయని, అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణ శివారు ప్రాంతాలకు కూడా తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుకు రూ.30 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు. మత్స్యకార గ్రామాల్లోని అటవీభూముల్లో నిర్మించిన కాలనీల ప్రజలకు పొజిషన్ సర్టిఫికెట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పూరిమెట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, మోషే, ఎన్వీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 48 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.37.21 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

ఉత్సాహంగా కుల సంఘాల కార్తీక వనభోజనాలు



సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, మండలంలో ఆదివారం పలు కుల సంఘాల కార్తీక వనభోజన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని ఆముదాలదిన్నె వద్ద జరిగిన గౌడసంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని గౌడ సామాజిక వర్గ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గౌడసంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2026వ సంవత్సర నూత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమాలను తిలకించారు. అలాగే వైకుంఠపురంలోని ఏటూరి రామిరెడ్డి తోటలో జరిగిన రెడ్డి సంక్షేమ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాలు, ప్రతిభకలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఏటూరి రామిరెడ్డి సేవలను స్మరించుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమ నిర్వాహకులను సత్కరించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సాయంత్రం ఆర్యవైశ్యమిత్ర మండలి ఆధ్వర్యంలో కొత్త బజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద జరిగిన వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని నార్త్ జనతాపేటలో ఏర్పాటు చేసిన నిరామయ యోగా థెరపీ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా అత్యంత అవసరమని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిలు, ఆందోళనలు పెరిగిన నేపథ్యంలో యోగా, నేచురల్ థెరపి ద్వారా ప్రజలు ఆరోగ్యకరమైన జీవనం గడపగలరని ఎమ్మెల్యే తెలిపారు.

ముమ్మరంగా పొగ నాట్లు



అయ్యవారిపల్లెలో పొగ నాట్లు వేస్తున్న కూలీలు

వలేటివారిపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగనాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొంథా తుఫాన్ ప్రభావం వలన ఎడతెరిపి లేకుండా వారం రోజులు వర్షాలు కురిశాయి. ముందుగానే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రస్తుతం వర్షం తెరపివ్వడంతో నాలుగైదు రోజులు నుంచి పొగనాట్లు చేపట్టారు. ఎర్రరేగడి, నల్లరేగడి రైతులు ఒక్కసారిగా పొగనాట్లు వేయడంతో పొగనాట్లు ముమ్మరమయ్యాయి. దీనికి తోడు పొగనారు మూట ధర రూ.6 వేలకు పెరిగింది. దీంతో పొగనారు, కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తిరిగి వర్షం పడితే మళ్లీ 10 రోజులు పొలాలు అరవు అనే ఉద్దేశ్యంతో రైతులు పొగనాట్లు ప్రక్రియను వేగవంతం చేశారు. కూలీలకు ఒక్కొక్కరికి రూ.400 ఇస్తున్నారు. అయితే కూలీలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు కాంట్రాక్టుకు రూ.3 వేలు ఇచ్చి నాట్లు వేయించుకొంటున్నారు. దీంతో పాటు వాటర్‌ట్యాంక్‌కు వెయ్యి చెల్లిస్తున్నారు. మొత్తంగా రైతులు పొగ నాటలో బిజీగా ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



కావలిలో జరిగిన ఎస్ఎఫ్ఐ మహాసభలో పాల్గొన్న నాయకులు

కావలి(టౌన్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6000 కోట్లు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీ.నరేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కామ్రేడ్ శివరామసుబ్బయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చి 16 నెలలు కావస్తున్నప్పటికీ విద్యారంగం పట్ల ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 77 జీవోను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందేవిధంగా కృషి చేయాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శిగా జయంత్, సునీల్, ఉపాధ్యక్షుడుగా వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా వర్షిత్, అజ్మత్, సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ కార్యవర్గం

కావలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ సమావేశం ఆదివారం పట్టణంలోని మేధా జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లూరు సిటీ యూనిట్ సెక్రటరీ బీ.కిరణ్‌కుమార్ ఎన్నికల అధికారిగా, వీ.ఫణీంద్రబాబు సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కావలి తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా డాక్టర్ ఎం.చైతన్య, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీధర్‌బాబు, సీహెచ్.సుకుమార్‌బాబు, ఎన్‌వీ.సతీష్, డీ.రత్నాకర్, పీ.శ్రీహరిబాబు, కార్యదర్శిగా టీకే.చలపతిరావు, కోశాధికారిగా బీ.పద్మజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.రేవతి, సంయుక్త కార్యదర్శులుగా బీవీ.రాధాకుమారి, డీ.అనిల్‌కుమార్, పీ.మనోజ్‌కుమార్, బీ.నారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు అభినందించారు.

చంద్రన్న ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నవరం వెంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య లక్ష్మమ్మకు రూ. 5 లక్షల చంద్రన్న ప్రమాద బీమా చెక్కును టీడీపీ నాయకులు ఆదివారం అందజేశారు. టీడీపీ సభ్యత్వం కలిగిన వెంగయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమగ్ర వివరాలతో విజయవాడ పార్టీ కార్యాలయానికి పంపడంతో వెంగయ్యకు రూ. 5 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరయింది. ఆ చెక్కును మృతుడి భార్య లక్ష్మమ్మకు టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల తిమ్మయ్య, దాపనేని చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


కార్తీక వనభోజనం విజయవంతం చేయండి



కార్తీక వనభోజనం ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న యాదవులు

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో మర్రిపాడు మండలలోని పీఎన్‌ఆర్ బృందావనంలో ఈనెల 16వ తేదిన జరిగే కార్తీక వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా యాదవ భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సంగంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి వనభోజన మహోత్సవంపై ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనభోజన మహోత్సవంలో గోపూజ, ఉసిరి చెట్టు పూజ, విశలింగ పూజ కార్యక్రమాలు జరుగుతాయని, జిల్లాలోని యాదవులంతా కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం సొసైటీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, పీలం సురేష్‌యాదవ్, హరిబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి




మాట్లాడుతున్న బీజేపీ నేత పొందూరి వెంకటకృష్ణారెడ్డి

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై నేతలు దృష్టి సారించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటడం లక్ష్యంగా ప్రతి గ్రామంలో క్రియాశీల సభ్యులను నియమించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు పొందూరు వెంకటకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణశాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్త నాయకుడేనని, బూత్ కమిటీలు, శక్తి కేంద్ర బాధ్యులు, వివిధ మోర్చాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, జొన్నాదుల సురేష్, జగన్నాథం వైకుంఠం, చల్లా వెంకటరాజా, మాల్యాద్రినాయుడు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కలిగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరులో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆది దంపతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



శివపార్వతుల కల్యాణంలో భక్తులు